

అంతటా అప్రమత్తం

సరిహద్దుల్లోనే కాక జనావాసాల్లోనూ యుద్ధవాతావరణం ముదురుతుండడంతో కేంద్రప్రభుత్వం ప్రజలను భద్రతాపరంగా చైతన్యవంతం చేసే పనులు మొదలుపెట్టింది. అనుకోని సంఘటనలు జరిగినట్లయితే ప్రజలు, సంస్థలు వాటిని సమర్థంగా ఎలా ఎదుర్కోవాలన్న అంశాలపై అవగాహన కల్పిస్తోంది.





మాక్‌డ్రిల్‌లో భాగంగా ఉగ్రదాడిలో గాయపడిన ప్రయాణికులు

చిత్తూరు రైల్వేస్టేషన్‌లో మాక్‌డ్రిల్

చిత్తూరు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడుల్లాంటివి జరిగితే వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అవగాహనకు చిత్తూరు రైల్వేస్టేషన్‌లో పోలీసులు, రైల్వే పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది సంయుక్తంగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. అకస్మాత్తుగా రైల్వేస్టేషన్‌లో ఉగ్రదాడి జరిగితే సమీపంలోని పౌరులు తమకు తాము ఏ విధంగా రక్షణ పొందాలి, ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలి...రక్షణ దళాలు ఉగ్రవాదులను ఎలా ఎదుర్కోవాలి అనే విషయాలను కళ్లకు కట్టినట్లుగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ ఏఎస్పీ శివానంద కిషోర్ మాట్లాడుతూ ప్రయాణికులు, ప్రజలు ఇలాంటి సందర్భాల్లో ఏం చేయాలి... దాడి నుంచి ఎలా తప్పించుకోవాలో తెలియజేశామన్నారు. దాడిలో గాయపడితే ఆ సమయంలో ఎలాంటి భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలి, ప్రజలకు ఎలాంటి రక్షణ కల్పించాలనే విషయాలను చూపించామన్నారు. గాయపడిన వారిని అంబులెన్సులో ఎలా తరలించాలి, బాంబులు అమర్చిన ప్రాంతాన్ని బాంబు స్క్వాడ్ ద్వారా గుర్తించి వాటిని ఎలా డిస్పోజ్ చేయాలి, ఉగ్రవాదులను ఎలా హతమార్చాలనే అంశాలను మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. తప్పుడు సమాచారాన్ని...యుద్ధ సన్నివేశాలను వ్యాప్తి చేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలకు ఎవరైనా అనుమానస్పదంగా కనిపించినా వెంటనే 112కు కాల్ చేయాలని సూచించారు.డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, వన్ టౌన్ సీఐ మహేశ్వర, టూ టౌన్ సీఐ నెట్టికంఠయ్య, ఆర్పీఎఫ్ సీఐ కుమార్, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కరుణాకర్, రైల్వే ఎస్ఐ ప్రవీణ్, మున్సిపల్, ఎలక్ట్రికల్, వైద్య, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఐవోసీఎల్‌లో మాక్ డ్రిల్



భద్రతా ప్రమాణాల పరిశీలనలో కలెక్టర్, ఎస్పీ

యాదమరి, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత యుద్ధ వాతావరణంలో ఉగ్ర దాడులకు ఐవోసీఎల్ వంటి ఇంధన సంస్థలు ప్రధాన లక్ష్యాలుగా మారే అవకాశాలుండడంతో వాటిలో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. యాదమరి ఐవోసీఎల్‌లో భద్రతా ప్రమాణాలను గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠతో పరిశీలించారు.చీఫ్ టెర్మినల్ అరుణ్ ప్రసాద్‌తో సమావేశమై భద్రతా చర్యలపై చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐవోసీఎల్ టెర్మినల్ వద్ద ఊహించని ఘటనలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలపై పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఇంధనం నింపుకోవడానికి వచ్చే లారీలను సెక్యూరిటీ సిబ్బంది పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలన్నారు.అనుకోని సంఘటనలు జరిగినట్లయితే జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఐవోసీఎల్‌లో ఉన్న స్టోరేజ్ పాయింట్ వద్ద ఉగ్రవాద దాడులను ఎదుర్కొనేందుకు ఎలా స్పందించాలో వివరించారు.ఐవోసీఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ, ఏఎస్పీ రాజశేఖర రాజు, తహసీల్దార్ పార్థసారథి, వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు, ఎస్ఐ ఈశ్వర్, ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, వీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్ సిబ్బందితో సమావేశమైన కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు డీసీసీబీపై సభాసంఘం

- కొణతాల నేతృత్వంలో అసెంబ్లీ కమిటీ ఏర్పాటు
- వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా సాగిన కార్యకలాపాలు



చిత్తూరు డీసీసీబీ ప్రధాన కార్యాలయం



కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో జరిగిన అవినీతి అక్రమాలపై చర్యలకు అడుగు పడింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో చోటు చేసుకున్న అవినీతి, నిధుల దుర్వినియోగం, అక్రమాలపై శాసన సభాసంఘం విచారణ చేపట్టనుంది. ఇందుకు సంబంధించి మాజీ మంత్రి, ప్రస్తుత అనకాపల్లె ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నేతృత్వంలో శాసనసభా కమిటీని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నియమించారు. చిత్తూరు డీసీసీబీతో పాటు రాష్ట్రంలోని అన్ని డీసీసీబీల వ్యవహారాలపై ఈ కమిటీ విచారించనుంది. ఈ కమిటీలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సభ్యుడిగా నియమించారు. చిత్తూరు డీసీసీబీలో జరిగిన అవినీతి అక్రమాలపై సహకార చట్టం సెక్షన్ 51 కింద డీఆర్వో మోహన్ కుమార్ విచారణ పూర్తి చేశారు. ఈ నెల 15 తరువాత కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు నివేదికను అందించనున్నారు. దాన్ని కలెక్టర్ పరిశీలించిన అనంతరం ప్రభుత్వానికి పంపనున్నారు.

గత వైసీపీ పాలనలో డీసీసీబీ బ్యాంకు పాలన ఇష్టారాజ్యంగా సాగింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులైన మొగసాల రెడ్డమ్మ అధ్యక్షతన ఏడుగురు సభ్యులతో కూడిన పర్సన్ ఇన్‌ఛార్జీల కమిటీలతోనే సహకార ఎన్నికలు నిర్వహించకుండా కథ నడిపించేశారు. పాలకమండలి సభ్యులతో పాటు బ్యాంకు ముఖ్య అధికారులు వైసీపీ నేతలతో కలిసి పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు.నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగ నియామకాలు జరిగాయి. దీనిపై అప్పట్లో ఆంధ్రజ్యోతి ఆధారాలతో సహా కథనాలు ప్రచురించింది. మరోవైపు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు డీసీసీబీలో అక్రమాలపై ఓ నివేదిక తయారు చేసి సీఎం చంద్రబాబుకు అందిస్తూ అప్పటి పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలని కోరారు.దీంతో ప్రభుత్వం గత అక్టోబరు 10న డీసీసీబీ అక్రమాలపై విచారణకు ఆదేశించింది.దీంతో అధికారులు తమ ఉద్యోగాలను కాపాడుకోవడం కోసం వైసీపీ నేతలకు మంజూరు చేసిన రుణాల వసూళ్లకు దిగారు.జిల్లా సహకార శాఖ అధికారిణి నాగవర్ధిని విచారణ జరిపి నివేదికలు అందించాలని గత అక్టోబరు 10న ప్రభుత్వం ఆదేశించారు. ఈ విచారణ బృందంలో చిత్తూరు డీఎల్‌సీవో వనజ, డీసీఏవో బ్రహ్మానందరెడ్డితో పాటు 12 మంది కో ఆపరేటివ్, సీనియర్ ఇన్స్‌పెక్టర్లు వున్నారు.రెండు వారాలు బ్యాంకు ప్రధాన కార్యాలయంతో పాటు 12 శాఖల్లో విచారణ జరిపారు. నిధుల గల్లంతు, అవినీతి జరిగింది నిజమేనంటూ వారు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దాంతో ప్రభుత్వం సహకార చట్టం సెక్షన్ 51 కింద విచారణకు ఆదేశిస్తూ కలెక్టర్ నివేదికను 120 రోజుల్లోగా అందించాలని ఆదేశించింది.

● అవినీతిపై అసెంబ్లీలో చర్చ..

డీసీసీబీలో నెలకొన్న పరిస్థితులే అన్ని జిల్లాల్లోని డీసీసీబీ, సింగిల్ విండోల్లో నెలకొన్నట్లు మార్చి 20న అసెంబ్లీ సమావేశాల్లో పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. అన్ని బ్యాంకులపై సమగ్ర విచారణకు సభాసంఘాన్ని ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. ఆ మరుసటి రోజు అందుకు సంబంధించి తీర్మానం చేశారు. బ్యాంకుల్లో అక్రమాలపై విచారణ కోసం సీనియర్ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కమిటీని నియమిస్తూ ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదలైంది. ఈ కమిటీలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ప్రభుత్వం చోటు కల్పించింది.కమిటీ తొలి సమావేశం జరిగిన రోజు నుంచి ఆరు నెలల్లో విచారణ పూర్తి చేసి నివేదిక అందించాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ లోపు సభాసంఘం చిత్తూరు డీసీసీబీలో విచారణ చేసే అవకాశం ఉంది. ఈ నెల 15న డీఆర్వో కలెక్టర్‌కు అందజేయనున్న నివేదికను సభాసంఘం ప్రామాణికంగా తీసుకుని తన విచారణను కొనసాగించే అవకాశం ఉంది.

సత్యవేడులో ప్రజా దర్బార్

- మంత్రి లోకేశ్‌కు వినతుల వెల్లువ
- ముగిసిన రెండు రోజుల పర్యటన



ప్రజా దర్బార్‌కు వచ్చిన వికలాంగుడు వరుణ్‌ను పలకరిస్తున్న లోకేశ్

సత్యవేడు, మే 8 (ఆంధ్రజ్యోతి): సత్యవేడులో గురువారం ఉదయం మంత్రి లోకేశ్ 62వ ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధ పడుతున్న ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారులతో సెల్ఫీలు దిగారు. మంత్రికి వినతులు వెల్లువెత్తాయి.అనంతరం శ్రీసిటీకి వెళ్లిన లోకేశ్ ఎల్‌జీ పరిశ్రమ భూమిపూజలో పాల్గొనడంతో రెండు రోజుల పర్యటన ముగిసింది. ఆయన పర్యటన సత్యవేడు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపింది. కొన్నేళ్లుగా సందిగ్ధావస్థలో ఉన్న కేడర్‌కు ఆయన ఇచ్చిన భరోసా ఉత్సాహం నింపిందనే చెప్పాలి. 'ఇక్కడి సమస్యలన్నీ తెలుసు. పరిష్కరిస్తాం. ఇద్దరు అబ్జర్వర్లను నియమించాం. సమస్యలుంటే వారితో చర్చించి, పరిష్కరించుకోండి. అవసరమైతే జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉన్నారు. అలకలు వీడి ఏకతాటిపై నిలబడండి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కాలకేయులు (ప్రతిపక్షం) కాచుకుని ఉన్నారు. మళ్ళీ రాష్ట్రం చీకట్లోకి వెళ్ళాల్సి వస్తోంది జాగ్రత్త' అంటూ లోకేశ్ ఇచ్చిన పిలుపునకు కార్యకర్తల నుంచి విపరీత స్పందన వచ్చింది.

లోకేశ్ ప్రజా దర్బార్‌కు వైసీపీ నేతలు

మంత్రి లోకేశ్ నిర్వహించిన ప్రజా దర్బార్‌కు సత్యవేడు మండల వైసీపీ నేతలు హాజరయ్యారు.మండలంలో పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీకి కేటాయించడానికి జరుపుతున్న భూసేకరణను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. పారిశ్రామిక అభివృద్ధి ముఖ్యం కదా.. పరిశ్రమలు వస్తే మీ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది కదా అని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. అయినా పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. వారు లోకేశ్‌తో సెల్ఫీ దిగారు.

అవసరమైతే బియ్యం అదనపు కోటా ఇస్తాం: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారుల కోసం మేనెల కోటా కింద జిల్లాకు 8642.430 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం కేటాయించిందని జేసీ విద్యాధరి తెలిపారు. ఈ కేటాయింపుల్లో హెచ్చుతగ్గులుంటే ఆయా డీలర్లు స్థానిక తహసీల్దార్ ద్వారా నివేదిక అందజేస్తే, పరిశీలించి అదనపు బియ్యం కోటా అలాట్ చేస్తామని పేర్కొన్నారు. కార్డుదారులందరూ తమ రేషన్ కార్డుకు అందాల్సిన పూర్తి బియ్యం కోటాను ఎండీయూ వాహనదారుడు లేదా ఎఫ్‌పీ షాపు డీలరు ద్వారా పొందాలని సూచించారు.

త్వరలో బోయకొండ గంగమ్మ భక్తులకు నిత్యాన్నప్రసాదం

చౌడేపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో భక్తులకు త్వరలో నిత్య అన్న ప్రసాదం అందించనున్నారు.రాష్ట్రంలోని పలు ఆలయాల్లో అన్న ప్రసాదం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో బోయకొండ గంగమ్మ ఆలయానికి చోటు దక్కింది. అమ్మవారికి వార్షికాదాయం సుమారు రూ.13 కోట్లు వస్తుండగా అన్నదాన నిధిలో సుమారు రూ. 2 కోట్లపైనే భక్తులు విరాళంగా ఇచ్చిన సొమ్ములున్నాయి.ప్రతి శుక్రవారం సుమారు 400 నుంచి 1200 మంది భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు.త్వరలో నిత్యం అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేయనున్నారు.

నేటినుంచి భగభగలు

విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక

చిత్తూరు కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా ఎండ తీవ్రత, వర్షాలు కొనసాగుతున్నాయి. గురువారం ఈదురుగాలులతో వర్షాలు అక్కడక్కడా కురవగా, పగటి ఉష్ణోగ్రతలు నగరి, తవణంపల్లె మండలాల్లో 40 డిగ్రీలకు మించి నమోదయ్యాయి. కాగా శుక్రవారం నుండి జిల్లాలో ఎండలు పెరుగుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. తవణంపల్లెలో 40.4డిగ్రీలు, నగరిలో 40, శ్రీరంగరాజపురంలో 37.6, గుడిపాలలో 37.5, చిత్తూరులో 37.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బంగారుపాళ్యంలో 36.4, పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పంలో 36.3, బైరెడ్డిపల్లె, ఐరాల, చౌడేపల్లె, గంగాధరనెల్లూరు, యాదమరి, నిండ్ర, పాలసముద్రం, పెనుమూరు, విజయపురం మండలాల్లో 36, గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో 35.9, గుడుపల్లె, కుప్పం, వి.కోట, శాంతిపురం మండలాల్లో 35.5, సదుం, సోమల మండలాల్లో 35, రొంపిచెర్లలో 34.7, పలమనేరులో 33.9, పుంగనూరులో 32.9, రామకుప్పంలో 32.8 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.మరోవైపు 22 మండలాల్లో వర్షాలు కురిశాయి. పులిచెర్లలో 54.8మిమీ, పెనుమూరులో 39.4, సదుంలో 30.2, రొంపిచెర్లలో 26.8, పూతలపట్టులో 25.4, గంగవరంలో 23.4, పెద్దపంజాణిలో 20.2, పలమనేరులో 18.2, ఐరాలలో 16.9, బైరెడ్డిపల్లెలో 14.2, వెదురుకుప్పంలో 9.4, బంగారుపాళ్యంలో 9.2, యాదమరిలో 8.8, గుడుపల్లెలో 8.4, రామకుప్పంలో 6.2, శాంతిపురంలో 5.4, తవణంపల్లెలో 2.6, కుప్పంలో 2.2, గంగాధరనెల్లూరులో 2.0, చిత్తూరులో 2.0, గుడిపాలలో 1.8, వి.కోటలో 1.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

పిడుగుపాటుకు మహిళ మృతి



అర్చన(ఫైల్ ఫొటో)

పెద్దపంజాణి, మే 8 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గురై ఓ మహిళ మృతి చెందింది. పెద్దపంజాణి మండలం ముత్తుకూరు పంచాయతీ నెర్నిపల్లెకు చెందిన నాగభూషణం భార్య అర్చన(28) గురువారం పొలంలో పని చేసుకుంటుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది.మృతురాలికి ఐదేళ్ళ కుమారుడున్నాడు.

దివ్యాంగ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్

చిత్తూరు అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను ఇవ్వనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 11వ తేదీలోగా రుచీజబ్బ్రిబ్లాజటుజీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కనీసం 40 శాతం వైకల్యం ఉన్న అంధులు, బధిరులు, శారీరక వికలాంగులు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆగిన స్పైస్ జెట్ విమానం

- ప్రయాణికుల నిరసన

రేణిగుంట, మే 8, (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో బుధవారం రాత్రి సాంకేతిక కారణాలతో స్పైస్ జెట్ విమానం ఆగిపోయింది. హైదరాబాదు నుంచి రాత్రి 8 గంటలకు తిరుపతికి చేరుకుని 8.35గంటలకు హైదరాబాదుకు విమానం బయలుదేరాల్సి వుంది. తిరుపతికి చేరుకున్న ఈ విమానంలో హైదరాబాదు వెళ్లడానికి 70 మంది ప్రయాణికులు వేచి ఉన్నారు.అయితే విమానంలో సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్ యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు.విమానం మరమ్మతులు చేయాల్సి ఉందని సిబ్బంది ఆలస్యంగా చెప్పడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడున్న అధికారులు సర్ది చెప్పి టాక్సీలు కేటాయించి బస ఏర్పాటు చేశారు. తిరిగి గురువారం ఉదయం వీరంతా విమానాశ్రయం చేరుకోగా.. అప్పటికీ స్పైస్ జెట్‌కు మరమ్మతులు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో యాజమాన్యం టికెట్ల డబ్బును రీఫండ్ చేస్తామని చెప్పడంతో 10.30 గంటలకు ఇండిగో విమానంలో ప్రయాణికులు హైదరాబాదుకు వెళ్లారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కార్యకర్త కుటుంబానికి టీడీపీ ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మునస్వామి

రామకుప్పం, మే 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బల్ల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త రామచంద్రప్ప కుమారుడు జనార్ధన్ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, జిల్లా కార్యదర్శి జయశంకర్ గురువారం స్థానిక నేతలతో కలిసి జనార్ధన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబానికి వారు పార్టీ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి కృష్ణప్ప, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ ఎర్రప్ప, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణాల్లో అవినీతిపై కఠిన చర్యలు



చౌకదుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ హనుమంతు

చౌడేపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాల్లో బియ్యం స్టాక్, రికార్డులు సక్రమంగా లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హనుమంతు హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని పలు చౌక దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. స్టాక్‌కు, ఈపాస్ యంత్రాలలో ఉన్న స్టాక్‌కు వ్యత్యాసం ఉందన్నారు. ప్రతి నెలా వ్యత్యాసం ఎందుకు వస్తుందని, అలా ఉన్న చౌకదుకాణాలను తనిఖీ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదికలను పంపినట్లు తెలిపారు. స్టాక్ వ్యత్యాసం ఉన్న దుకాణ నిర్వాహకులపై చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ భారతి, వీఆర్వో శ్రీపతిరెడ్డి, దుకాణదారులు తదితరులు పాల్గొన్నారు.

పుంగమ్మ చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పుంగనూరు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): పుంగమ్మ చెరువు ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. పుంగనూరులో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణ పరిధిలోని పాత ఇళ్ల వ్యర్థపు మట్టిని పుంగమ్మ చెరువు కట్టపై వేయడంతో చెరువు రోజురోజుకు కుచించుకుపోతోందని ఆరోపించారు. చెరువు చుట్టుపక్కలా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మట్టితో పూడ్చుకుంటూ వస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని.. లేనిపక్షంలో చెరువు కట్టపై నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. మాల మహానాడు నాయకులు శ్రీనివాసులు, మంజు, సుబ్బన్న, మణి, దొరస్వామి పాల్గొన్నారు.

కల్లూరు లయన్స్‌క్లబ్ సేవలు విస్తృతం చేయాలి



రంగారెడ్డిని సన్మానిస్తున్న కల్లూరు లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

కల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరు లయన్స్‌క్లబ్ సేవలు మరింత విస్తృతం చేయాలని జిల్లా లయన్స్‌క్లబ్ రెండో గవర్నర్ రంగారెడ్డి తెలిపారు. గత నెలలో రెండో గవర్నర్‌గా ఎంపికైన రంగారెడ్డి తొలిసారిగా గురువారం పీలేరుకు రావడంతో కల్లూరు లయన్స్ క్లబ్ సభ్యులు కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్లు శ్రీనివాసులు, డాక్టర్ ప్రసాద్, విజయ భాస్కర్‌రెడ్డి, మహమ్మదలి, తాతయ్య, వెంకటశిద్దులు పాల్గొన్నారు.

మండల సమావేశాన్ని అడ్డుకోవడం హేయం



రికార్డులను చూపుతున్న ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం

పెద్దపంజాణి, మే 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు మండల సమావేశాన్ని అడ్డుకోవడం హేయనీయమని.. వైసీపీ నాయకులు అవినీతి గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని వీరప్పల్లె ఎంపీటీసీ సభ్యుడు సుబ్రహ్మణ్యం అన్నారు. గత రెండు రోజులుగా పెద్దపంజాణి మండల సర్వసభ్య సమావేశం జరుగకుండా వైసీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీలు అడ్డుకుంటున్నారని తెలిపారు. గురువారం సమావేశం వాయిదా అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జడ్పీటీసీ సుష్మాబాగారెడ్డి అవినీతిని ఎండగట్టారు. అభివృద్ధిని అడ్డుకోవడమే పరమావధిగా మారినట్లు వైసీపీ నాయకులు ప్రవర్తిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని . వారి అవినీతిని బట్టబయలు చేస్తామనే ఉద్దేశంతో సమావేశాన్ని అడ్డుకుంటున్నారన్నారు. మండలంలోని వీరప్పల్లె పంచాయతీలో రెవెన్యూ అధికారులను అడ్డు పెట్టుకుని సర్వేనంబరు 159/4 లో 2.72 ఎకరాల భూమి జడ్పీటీసీకి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఆయనతో లింగాపురం సర్పంచ్ రుద్రమూర్తినాయుడు, టీడీపీ నాయకుడు వెంకటప్ప పాల్గొన్నారు.

డైట్ లెక్చరర్‌గా సురేష్‌బాబు

కుప్పం, మే 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం పెద్దగోపనపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు టి.సురేష్‌బాబు కార్వేటినగరంలోని ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం (డైట్)లో సైకాలజీ బోధించుటకు ఫారిన్ సర్వీసు కింద ఎంపికయ్యారు. విద్యాశాఖ ఇటీవల నిర్వహించిన ట్యాబ్ బేస్డ్ పరీక్ష, ఇంటర్వ్యూలో మంచి ప్రతిభ కనబరచి ఈ అవకాశాన్ని అందుకున్నారు. సురేష్‌బాబును పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

బోయకొండ గంగమ్మకు రూ.63 లక్షల ఆదాయం



చౌడేపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మకు హుండీ లెక్కింపు ద్వారా రూ.63 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఉపకమిషనర్, ఆలయ ఈవో ఏకాంబరం తెలిపారు. 42 రోజులలో భక్తులు అమ్మవారికి హుండీ ద్వారా సమర్పించారన్నారు. అలాగే రణభేరి గంగమ్మ ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.40,463 నగదు వచ్చిందన్నారు. ఈ ఆదాయాన్ని చౌడేపల్లె సప్తగిరి గ్రామీణ బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు తెలిపారు. గ్రూప్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఆలయ సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు



రామకుప్పం మండలం పీఎంకే తాండాలో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ నాగరాజు తదితరులు

కుప్పం/రామకుప్పం, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాటుసారా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం కుప్పం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ నాగరాజు, పలమనేరు బీఎంపీపీ సీఐల ఆధ్వర్యంలో కుప్పం మండంలోని మల్లానూరు, అడవిబూదుగూరు, కొట్టాలూరు, మోట్లచేను, వాలూరు, గుండ్లమడుగు, బ్రహ్మదేవరచేన్లు, రామకుప్పం మండలం పీఎంకే తాండాలలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. నాటుసారా నిషేధంపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు జరిపారు. ఈ దాడుల్లో కుప్పం మండలం గణేశ్‌పురం క్రాసు వద్ద కృష్ణాపురం గ్రామానికి చెందిన ఎం.మురుగన్ రవాణా చేస్తున్న 20 కర్ణాటక మద్యం బాటిళ్లను గుర్తించి సీజ్ చేసి అతడిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కుప్పం ఎక్సైజ్ సీఐ నాగరాజు మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, కర్ణాటక, ఆంధ్రా మద్యం కలిగి బెల్టు షాపులు నిర్వహించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్తు సరఫరాలో రేపు అంతరాయం

కుప్పం, మే 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం 132 విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా కుప్పం, గుడుపల్లె మండలాలతో పాటు కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 10న శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రెస్కో డీఈఈ సీఎం.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

డీటీగా దొరస్వామి బాధ్యతల స్వీకరణ



దొరస్వామి

చౌడేపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె డీటీగా దొరస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గంగవరంలో పనిచేస్తున్న ఆయన డెప్యుటేషన్‌పై చౌడేపల్లె ఆర్ఎస్‌డీటీగా బదిలీపై చౌడేపల్లెకు వచ్చారు.

గుడివంక ఆలయ బోర్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం/గుడుపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండలం పెద్దగొల్లపల్లె గ్రామం గుడివంకలో వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దేవాదాయ ధర్మదాలయ శాఖ ఈవో కె.కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటీసు ప్రకటన చేసినప్పటి నుంచి 20 రోజుల అనంతరం ధర్మకర్తల మండలి నియామకం చేస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ధర్మకర్తలుగా నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నోటీసు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 20 రోజుల గడువు ముగిసిన తర్వాత దరఖాస్తులు స్వీకరించబోమని ఈవో తెలిపారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

చౌడేపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు కోసం అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. మ్యాపింగ్ అయిన సచివాలయంలోనే దరఖాస్తు చేసుకోవాలని, బియ్యం కార్డులో వ్యక్తులను కలపడం, తీయడం, కార్డు విభజన, చిరునామాలో మార్పులు, చేర్పుల కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

50 శాతం రాయితీతో జీలుగ విత్తనాలు

పుంగనూరు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పంటల దిగుబడి పెంచడానికి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో జీలుగ, జనుముల విత్తనాలు రైతులకు అందజేయనున్నట్లు పుంగనూరు ఏడీఏ శివకుమార్ గురువారం ఓ ప్రకటలో తెలిపారు. పుంగనూరు కు 70 క్వింటాళ్లు, చౌడేపల్లెకి 40 క్వింటాళ్లు, పెద్దపంజాణికి 70 క్వింటాళ్లు, గంగవరం మండలానికి 50 క్వింటాళ్లు, సోమలకు 70 క్వింటాళ్లు, సదుంకు 66 క్వింటాళ్లు, రొంపిచెర్లకి 70 క్వింటాళ్లు, పులిచెర్లకు 60 క్వింటాళ్లు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. అవసరమైన రైతులు ఆధార్‌కార్డు ఆధారంగా కొనుగోలు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. 10 కిలోల జీలుగ రూ.615, 10 కిలోల జనుములు రూ. 545 లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉత్సవాలకు ఎమ్మెల్సీ కంచర్లకు ఆహ్వానం



రామకుప్పం, మే 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఉన్సిగానిపల్లెలో శనివారం నుంచి ప్రారంభమయ్యే తిమ్మరాయస్వామి, చౌడేశ్వరమ్మ ఆలయాల వార్షిక ఉత్సవాలకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను ఎంపీపీ భర్త గుర్రప్ప నేతృత్వంలో స్థానిక టీడీపీ నేతలు గురువారం ఆహ్వానించారు. కార్యక్రమంలో నేతలు మణేష్, షణ్ముగం, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థిక శక్తిగా ఎదగాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. గురువారం పలమనేరు ఐకేపీ కార్యాలయంలో టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న శిక్షణ కార్యక్రమం మహిళలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రాథమిక టైలరింగ్ శిక్షణతో మహిళలకు కుట్టు, డిజైన్ నైపుణ్యాలను అందించడంతో పాటు వారికి ఆర్థిక చేయూతను కల్పిస్తున్నట్లు జరుగుతుందన్నారు. ఇంటికో మహిళా పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో టెక్స్‌టైల్ పరిశ్రమల స్థాపనకు పెద్ద కంపెనీలు ముందుకొస్తున్నాయని.. దీంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి, ఎంపీడీవో ఖాదర్‌బాషా, సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి.బాలాజీ, నాయకులు నాగరాజరెడ్డి, ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, ఖాజావీర్, నాగరాజు, మదన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



ఆధునిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శివకుమార్



చౌడేపల్లెలో అవగాహన కల్పిస్తున్న ఏవో జ్యోతమ్మ

పుంగనూరు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక పరిజ్ఞానంతో పంటలు పండించినప్పుడే అధిక దిగుబడి పొందవచ్చని ఏడీఏ శివకుమార్‌రాజు సూచించారు. గురువారం మండలంలోని మిట్టచింతలవారిపల్లె రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసి రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిజిటల్ పేమెంట్, అగ్రిసెంట్రల్ యాప్, వాతావరణ సమాచారం, వ్యవసాయ తదితర యాప్‌లపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. సమావేశంలో ట్రైనర్ హరినాయక్, వసంత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● చౌడేపల్లె: రైతులకు సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని ఏవో జ్యోతమ్మ, మాస్టర్ ట్రైనర్ నవీన్ అన్నారు. గురువారం దుర్గసముద్రం సచివాలయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు స్మార్ట్ ఫోన్ ఎలా ఉపయోగించాలో, ఫోన్‌పే, గూగుల్ పే, వ్యవసాయ, అగ్రిసెంట్రల్, మార్కెటింగ్ యాప్‌లపై , కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు తదితర వ్యవసాయ ఉపయోగాలపై రైతులకు శిక్షణ కల్పించారు.

● రొంపిచెర్ల: మండలంలోని రైతులు వ్యవసాయరంగానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సుధారాణి అన్నారు. గురువారం మండలంలోని గానుగచింత రైతుసేవా కేంద్రంలో స్కిల్ ఆఫ్ చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏఈవో ఆర్.సుబ్రహ్మణ్యం, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేసుకోవాలి



గర్భిణులు, బాలింతలకు సూచనలిస్తున్న వైద్యాధికారి శ్రీనివాసులు

గంగవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ప్రభుత్వాస్పత్రుల్లో పరీక్షలు చేయించుకొని అప్రమత్తంగా ఉండాలని గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని డ్రైవర్స్ కాలనీలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. ఎప్పటికప్పుడు దగ్గరలోని పీహెచ్‌సీలలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అలాగే దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారికి పీహెచ్‌సీలో అన్నిరకాల వైద్యపరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని, డాక్టర్ల సలహాలు తీసుకొని వ్యాధి తీవ్రత పెరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. దీంతో పాటు నివాసాల మధ్య నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్, మహబూబ్‌బాషా, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

22 లోపు మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

రొంపిచెర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐఐటీ, జేఈఈ, నీట్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరళ తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరే విద్యార్థులు ఈనెల 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి మార్కుల మెరిట్‌పై విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు. కోచింగ్ మెటీరియల్ సైతం ఇవ్వనున్నట్లు తెలిపారు.

అక్రమంగా రామకుప్పం ఎంపీపీ ఎన్నికలు : వైఎస్ జగన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జగన్, చిత్రంలో కుప్పం ఇన్‌చార్జి భరత్

రామకుప్పం, మే 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల పరిషత్‌లో టీడీపీ తరపున ఎంపీటీసీలె వరూ లేకపోయినప్పటికీ ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులను ఆ పార్టీ అక్రమంగా కైవసం చేసుకుందని వైసీపీ అధినేత జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం తాడేపల్లెలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలను టీడీపీ పెద్దలు ప్రలోభ పెట్టి పార్టీలోకి చేర్చుకున్నారన్నారు. టీడీపీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా వైసీపీ వైపే నిలిచిన 8 మంది ఎంపీటీసీలను అభినందించారు. వైసీపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి భరత్, రెస్కో మాజీ చైర్మన్ సెంథిల్‌కుమార్, రామకుప్పం వైస్‌ఎంపీపీ సుబ్రహ్మణం పాల్గొన్నారు.

చింతచెట్టుపై పిడుగు



కల్లూరు, మే 8 (ఆంధ్ర జ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పరిసరాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇదే సమయంలో కల్లూరుకి సమీపం దేవళంపేటలోని మునికృష్ణ ఇంటి వద్ద ఉన్న ఓ చింతచెట్టుపై పిడుగు పడింది. చెట్టుపై ఉన్న చిన్నపాటి పక్షులు మృతి చెందాయి. ముందస్తు సూచనలతో ప్రజలు ఇళ్లలోకి చేరుకున్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

కల్యాణ వెంకన్న ఆలయానికి మహాద్వారం



మహాద్వారానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బైరెడ్డిపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి ఆలయానికి సంబంధించి బేలుపల్లె క్రాస్‌లో నూతనంగా నిర్మించిన మహాద్వారాన్ని గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అర్చకులు మురళీకృష్ణాచార్యులు మహాద్వారానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహాద్వార నిర్మాణ దాతలు గౌరమ్మ, గుర్రాల గంగప్ప, కాంతరాజులు, మాజీ సైనికోద్యోగి కుటుంబ సభ్యులకు ఆలయ ధర్మకర్త నారాయణ మొదలి, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కల్యాణ వెంకన్న ఆలయ మహాద్వారం నిర్మించడం పూర్వజన్మ సుకృతమని, ఈ అవకాశం తమకు లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని దాతలు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

● తప్పిన ప్రమాదం



సోమల, మే 8 (ఆంధ్రజ్యోతి): సోమల-సదుం ప్రధాన రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొనడంతో స్తంభం విరిగిపోయింది. ఆ స్తంభానికే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నేల కూలింది. ట్రాన్స్‌ఫార్మర్ కారుపై పడి ఉంటే పెద్దప్రమాదం జరిగి ఉండేది. అదృష్టవశాత్తు నేలపై పడటంతో పెను ప్రమాదం తప్పింది. గురువారం మధ్యాహ్నం భాకరాపేటకు చెందిన పరంధామరెడ్డి అతని కుటుంబ సభ్యులు వి.కోట నుంచి తిరిగి స్వగ్రామానికి కారులో వస్తుండగా సోమల సమీపంలోని సదుం మార్గంలో కోళ్ల ఫారం వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. ప్రమాదంలో కారు దెబ్బతింది. ఎవరికీ ఎలాంటి గాయాలు లేకుండా బయట పడ్డారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను ఆపేశారు.

కనులపండువగా ఆదిదంపతుల కల్యాణం



ఆది దంపతులకు కల్యాణోత్సవం చేస్తున్న వేదపండితులు



గజవాహనంపై మృత్యుంజయేశ్వరస్వామి

చౌడేపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ఏడో రోజు శాస్త్రోక్తంగా ఆది దంపతులకు కల్యాణం నిర్వహించారు. గురువారం సాయంత్రం ఆలయంలో మృత్యుంజయేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఆది దంపతుల కల్యాణోత్సవం చేపట్టారు. అనంతరం స్వామి వార్లను గజవాహనంపై అధిష్ఠంపజేసి పూలు, ప్రభలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళ వాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా బసప్ప, శ్రీధర్, మజరా రెడ్లు వ్యవహరించారు.

ఆధ్యాత్మికం

రేపటి నుంచి ఉన్సిగానిపల్లెలో ఉత్సవాలు

రామకుప్పం, మే 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఉన్సిగానిపల్లెలోని తిమ్మరాయస్వామి, చౌడేశ్వరమ్మ ఆలయాల వార్షిక ఉత్సవాలు శనివారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం ఉదయం మహాగణపతి పూజ, స్వస్తివాచనం, ధ్వజారోహణం, కలశ స్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని పేర్కొన్నారు. హరికథాలాపన, తిమ్మరాయస్వామి, చౌడేశ్వరమ్మల ఊరేగింపు జరుగుతాయన్నారు. ఆదివారం హరికథాలాపన, రాత్రి పుష్పపల్లకి సేవ, నయ్యాండీ నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. సోమవారం పచ్చిగెరిగె ఊరేగింపు, అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మంగళవారం చౌడేశ్వరమ్మ, తిరుపతి గంగమ్మల గెరిగెల ఊరేగింపు, అగ్నిగుండ ప్రవేశాలు జరుగుతాయన్నారు. రాత్రి భక్తప్రహ్లాద నాటక ప్రదర్శన, బుధవారం కుంటగంగమ్మ, పెద్దపులిగంగమ్మ, ఊరిగంగమ్మల ఆలయాల్లో దీనారాధన, పొంగళ్ల సమర్పణ కార్యక్రమాలు జరుగుతాయ తెలిపారు.

ముగిసిన శ్రీరామకోటి నామస్మరణ



అలంకరణలో సీతారామలక్ష్మణులు

రామకుప్పం, మే 8(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం రాజుపేట గ్రామంలోని కోదండరామస్వామి ఆలయంలో బుధవారం ఉదయం ప్రారంభమైన అఖండ శ్రీరామకోటి నామస్మరణ కార్యక్రమం గురువారం ఉదయం ముగిసింది. శ్రీరామకోటి నామస్మరణ ముగింపు సందర్భంగా ఉదయం సీతారామలక్ష్మణుల మూలమూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి అలంకరణలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

10న చౌడేశ్వరి జ్యోతుల మహోత్సవం

రొంపిచెర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి) రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల పంచాయతీ నడంపల్లెలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 10న శనివారం ఉదయం నుంచి అమ్మవారికి విశిష్ట పూజలు, జ్యోతుల మహోత్సవం జరుగుతుందని వైస్ ఎంపీపీ, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు నూలు రెడ్డెప్ప, కార్యదర్శి వెంకట్రమణ గురువారం ఓ ప్రకటలో తెలిపారు. ఉత్సవంలో ఎలాంటి అల్లర్లు జరగుండా కార్యక్రమాల విజయవంతానికి ఎస్ఐ సుబ్బారెడ్డికి ఆహ్వాన పత్రిక ఇచ్చి బందోబస్తు కోరారు. 9న శుక్రవారం రాత్రి గ్రామ మహిళలచే రాగడీయులు ఉత్సవం, 10న పంచామృత అభిషేకం, ఊంజలసేవ, జ్యోతుల మహోత్సవం, అంబారి జగన్ అలంకరించే పుష్పపల్లకి, తొగటవీర క్షత్రియులచే మేలుకొలుపు పద్యాలు, సాంస్కృతి కార్యక్రమాలతో పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని తెలిపారు.

ఇంటర్ ఫస్టియర్ స్టేట్ టాపర్లకు అభినందన



ప్రజ్వల, నక్షత్రలను అభినందిస్తున్న కలెక్టర్

చిత్తూరు సెంట్రల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో స్టేట్ టాపర్లుగా నిలిచిన చిత్తూరు పీఎస్ఎన్ శ్రీవివేకానంద కళాశాల విద్యార్థినులు కె.ప్రజ్వల, పి.నక్షత్రలను కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం తన చాంబర్‌లో అభినందించారు. ఫస్టియర్ ఎంపీసీ విద్యార్థినులు కె.ప్రజ్వల, పి.నక్షత్రలు రీవాల్యుయేషన్‌లో మరిన్ని మార్కులు సాధించి స్టేట్ టాపర్లుగా నిలిచారు. కె.ప్రజ్వలకు తొలుత (462/470) మార్కులు వచ్చాయి. ఇంగ్లీష్ సబ్జెక్టులో 93 మార్కులు రాగా, రీవాల్యుయేషన్ తర్వాత 99 వచ్చాయి. ఆరు మార్కులు పెరగడంతో 468/470 మార్కులతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. పి.నక్షత్రకు తొలుత (463/470) మార్కులు వచ్చాయి. ఈమెకు కూడా ఇంగ్లీషులో 95 మార్కులు రాగా, రీవాల్యుయేషన్ తర్వాత 99 వచ్చాయి. నాలుగు మార్కులు పెరగడంతో 467/470 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. ఈ విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ వి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజశెట్టి, అధ్యాపకులు అభినందించి, కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల్లో ప్రజ్వల తల్లిదండ్రులు చిన్నారెడ్డి, సంగీత, నక్షత్ర తల్లిదండ్రులు సుధాకర్‌రెడ్డి, నీలావతి పాల్గొన్నారు.

తెలుగు మహిళ శ్రీదుర్గ మృతిపై విచారణ



సూపరింటెండెంట్ రాధకు ఆధారాలను సమర్పిస్తున్న షణ్ముగం

తిరుపతి(వైద్యం), మే 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించిన చిత్తూరు తెలుగు మహిళా నాయకురాలు శ్రీదుర్గకు సంబంధించి రుయా వైద్యాధికారులు గురువారం విచారణ ప్రారంభించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆమెను అపోలో నిర్వహిస్తున్న ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యుల నిర్లక్ష్యంతో చనిపోయిందని మృతురాలి తండ్రి, బీసీ సంక్షేమ సంఘం నేత షణ్ముగం ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. ఆయన ఈ విషయంపై విచారణ చేపట్టాలని రుయా అధికారులను ఆదేశించారు. ఈక్రమంలో గురువారం రుయాస్పత్రిలో అధికారుల ఆధ్వర్యంలో విచారణ నిర్వహించారు. విచాణకు షణ్ముగం హాజరై తన వద్ద ఉన్న ఆధారాలను సూపరింటెండెంట్ రాధకు సమర్పించారు. పూర్తి స్థాయిలో విచారించాక కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని రాధ తెలిపారు.

సైనికులను చూసి గర్విస్తున్నాం



పుంగనూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూరం విజయవంతం కావడంపై కూటమి పార్టీల శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు పుంగనూరులో సంబరాలు జరుపుకున్నారు. గురువారం స్థానిక ఇందిరా సర్కిల్‌లో జాతీయజెండా ప్రదర్శిస్తూ భారత్ జిందాబాద్, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.బీజేపీ నాయకులు పి.అయూబ్‌ఖాన్, నరసింహులు, టీడీపీ నాయకులు రామయ్య, ప్రజా సంఘ నాయకులు రాజన్న, అమరనాథ్, గంగులప్ప, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయండి: డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని డీఆర్వో మోహన్ కుమార్ ఆదేశించారు. గురువారం తన చాంబర్‌లో ఈ పరీక్షలపై ఇంటర్, రెవెన్యూ, పోలీసు, పోస్టల్, ఇతర సంబంధిత అధికారులతో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లావ్యాప్తంగా 35 పరీక్ష కేంద్రాల ద్వారా 15,377 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాలని చెప్పారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ఉదయం ఆరు గంటల నుంచే రవాణా సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలిచ్చారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏఎన్ఎం, నర్సులను నియమించాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. ఫస్టియర్ పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. జనరల్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ప్రాక్టికల్స్ పరీక్షలు ఈనెల 28 నుంచి జూన్ ఒకటో తేదీవరకు జరుగుతాయన్నారు. సమావేశంలో డీఐఈవో శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డిటోనేటర్ పేలడంతోనే బాలుడికి గాయాలు

యాదమరి, మే 8 (ఆంధ్రజ్యోతి): డిటోనేటర్ పేలడంతోనే బాలుడికి గాయాలైనట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. గురువారం ఎస్ఐ ఈశ్వర్ మీడియాకు వివరాలు తెలిపారు. బుధవారం నాటు బాంబు పేలడంతో యాదమరి మండలంలోని కె.కొత్తూరుకు చెందిన సౌజన్య కొడుకు లోహిత్ చేతులకు తీవ్రగాయాలైనట్లు తొలుత అనుకున్నారు. అయితే బాలుడు మేకలు మేపడానికి ఊరి సమీపంలోకి వెళ్లినప్పుడు అదే గ్రామానికి చెందిన అశోక్ వ్యవసాయ పొలాల్లో ఆడుకుంటుండగా అక్కడ డిటోనేటర్‌కు సంబంధించి కేబుల్ వైరు కనిపించింది. ఆటలాడుకునే వైరుగా భావించి చేతులతో గట్టిగా పట్టుకుని లాగడంతో అది పేలడంతో బాలుడు గాయపడినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో టమోటా రైతు మృతి



రెడ్డెప్ప (ఫైల్ ఫొటో)

సోమల, మే 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీ ఇర్లపల్లెకు చెందిన గంగనేని రెడ్డెప్ప (53) గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రెడ్డెప్ప ఎకరా పొలంలో టమోటా సాగు చేశాడు.ఇందుకోసం సుమారు రూ3 లక్షల దాకా అప్పులు చేశాడు. ప్రస్తుతం టమోటా పంట కోత దశలో ఉంది. అయితే మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేకపోవడం... కోతలు చేయలేని పరిస్థితి ఉండటంతో రెడ్డెప్ప బాధపడుతుండేవాడు. ఈక్రమంలోనే ఇంటివద్ద బుధవారం రాత్రి గుండె నొప్పితో మృతి చెందాడు.

బండ వేషంలో గంగమ్మ భక్తులు



తిరుపతి, మే 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగ జాతరకు వర్షం పడటం సంప్రదాయం. జాతర మొదలైన మూడో రోజైన గురువారమూ వాన పడింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా, ఆ తర్వాత చిరుజల్లులుగా మొదలై ఓ మోస్తరు వర్షం కురిసినా భక్తులు వెనకడుగు వేయలేదు. శరీరమంతా రక్తం చిందినట్టు కుంకుమ రాసుకుని, కాటుక బొట్లు, తెల్లటి పూలు చుట్టుకుని వయోపరిమితి లేకుండా బండ వేషంలో గంగమ్మను దర్శించుకున్నారు. మిగతా భక్తులూ అమ్మవారి దర్శనానికి తరలి వచ్చారు. కొందరు చిత్ర, విచిత్ర వేషాలతో భయానకంగా కనిపించారు. ముందుగా వేశాలమ్మను.. ఆతర్వాత తాళ్లపాక పెదగంగమ్మ, తాతయ్యగుంట గంగమ్మ, అంకాళమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. కాగా, వేశాలమ్మ బండవేషంలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం భక్తులు తోటి వేషధారణతో గంగమ్మను దర్శించుకుంటారు. ఎక్కువగా పిల్లలు ఈ వేషం వేస్తారు.

లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మంగళపల్లె విద్యార్థులు

అభినందించిన మంత్రి నారా లోకేశ్



మంత్రి లోకేశ్‌తో రికార్డు సాధించిన ఉపాధ్యాయుడు, విద్యార్థులు

బంగారుపాళ్యం, మే 8 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులకు, ఓ ఉపాధ్యాయుడికి లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. వీరిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మంగళపల్లె పాఠశాల గణిత ఉపాధ్యాయుడు, లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న హెచ్.అరుణ శివప్రసాద్ వివరాలు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు పై విలువను 3600 దశాంశాల వరకు చెప్పారన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని లహరి.. 1000 దశాంశాలను 4 నిమిషాల 55 సెకండ్లలో పూర్తి చేసిందన్నారు. పదో తరగతి విద్యార్థులైన పునీత్ సాయి.. 1001 నుంచి 2000 దశాంశం వరకు 7 నిమిషాల 31 సెకండ్లలో, ఏపీ హేమ.. 2001 నుంచి 3000 దశాంశం వరకు 8 నిమిషాల 11 సెకండ్లలో పూర్తి చేశారన్నారు. అలాగే తమ పాఠశాల పూర్వ విద్యార్థిని, ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రేవతి.. 3001 నుంచి 3600 దశాంశం వరకు 8 నిమిషాల్లో పూర్తి చేసిందన్నారు. వీరికి తాను మెంటార్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. తాము పై విలువతో దశాంశాలు చేసిన వీడియోను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడంతో లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు గుర్తించి గత నెల 28వ తేదీన తమకు అవార్డులు ప్రకటించారన్నారు. ఈ క్రమంలో తాము మంత్రి లోకేశ్‌ను సత్యవేడులో గురువారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమం సందర్భంగా కలిసి రికార్డులను ఆయన చేతుల మీదుగా అందుకున్నామని వివరించారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇలాంటి ఉత్తమ ప్రతిభ చూపడం, వీరిలోని ప్రతిభ వెలికితీయడంపై ఉపాధ్యాయులను అభినందించారు. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వం కూడా అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు అరుణ, ఏపీ మ్యాథ్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు చంద్రమనాయుడు, ఉపాధ్యాయులు పాపుదేశి జయంతి, ఏపీ లలిత, భారతి, జగత్ బాబు పాల్గొన్నారు.

పుంగనూరు మెప్మాలో రూ.22.50 లక్షల స్వాహా

● ఆర్పీ చేతివాటంతో లబోదిబోమంటున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు



పుంగనూరు మెప్మా కార్యాలయం - పలమనేరు డీఎస్పీ ప్రభాకర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధిత మహిళలు

పుంగనూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): స్వయంసహాయక సంఘాల్లోని మహిళల ఆర్థిక పురోగతికి కృషిచేయాల్సిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) రీసోర్స్ పర్సన్ సభ్యులకు చెందిన రూ.22.50లక్షల నిధులు స్వాహా చేసిన సంఘటన పుంగనూరులో వెలుగు చూసింది. ఇటీవల బాధిత మహిళలు డీఎస్పీ ప్రభాకర్‌కు ఫిర్యాదు చేయగా, నిధుల దుర్వినియోగం, రికవరీపై పుంగనూరు మెప్మా సీఎంఎం హరినాయక్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గురువారం తెలిపారు. ప్రతి ఎస్‌హెచ్‌జీ (స్వయంసహాయక సంఘం) సభ్యురాళ్లకు బ్యాంక్ లింకేజీ రుణాలు, సమైఖ్య, పొదుపు, వడ్డీ, తదితర రుణాలు ఇప్పించడం, చెల్లింపులు, గ్రూపులతో సమావేశాలు, ప్రభుత్వ పథకాలు వివరించడం తదితర కార్యక్రమాల్లో ఆర్పీలు కీలకంగా ఉంటారు. పుంగనూరు మున్సిపాలిటీలో 1089మహిళా సంఘాలుండగా 11వేల మంది సభ్యులున్నారు.ప్రతినెలా ఆర్పీలు సమావేశాలు నిర్వహించి రుణాలు, వసూళ్లపై సమీక్షించాల్సి వుంది. రుణాల చెల్లింపుకోసం కొందరు నగదు వసూలు చేసి బ్యాంకుల్లో చెల్లించకుండా వాడుకుంటుండడం, సభ్యుల పేర్లతో రుణాలు తీసుకుని స్వాహా చేస్తుండడం...దానివల్ల సభ్యులకు రుణాలు రాకపోవడం ఇటీవల ఎక్కువైంది. పుంగనూరు మెప్మాలో పనిచేసే ఆర్పీ కె.రెడ్డిరాణి రూ.32,10,650 నిధులు స్వాహా చేశారని గత ఏడాది అక్టోబరు 25వ తేది కొందరు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయడంతో మెప్మా డైరెక్టర్ విచారణకు ఆదేశించారు. స్థానిక నగరివీధి 17వ వార్డులోని శ్రీవైభవలక్ష్మి స్లమ్ సమైఖ్యలో 280మంది సభ్యురాళ్లుండగా ఆర్పీగా కె.రెడ్డిరాణి వ్యవహరిస్తున్నారు. 2018 నుంచి సభ్యుల పొదుపు, వడ్డీ ద్వారా వచ్చిన మొత్తాన్ని వారికి తెలియకుండా సొంతఖర్చులకు ఆర్పీ వాడుకున్నట్లు విచారణలో తేలింది. తాను వాడుకున్న నిధుల్లో 2024 అక్టోబరు 11వ తేది రూ.15 లక్షలు , 2024 డిసెంబరు 11వ తేది మిగిలిన రూ.17,10,660 సొమ్మును సమైఖ్య సమావేశాల్లో చెల్లిస్తానని, లేకపోతే క్రిమినల్, సివిల్ చర్యలు తీసుకోవచ్చునని 2024 సెప్టెంబరు 20వ తేది నోటరీతో డాక్యుమెంట్‌పై రాసిచ్చారు. కానీ భారీగా శ్రీవైభవలక్ష్మి స్లమ్ సమైఖ్యలో రుణ బకాయిలు ఉండటంతో సభ్యులకు రుణాలు రాకపోవడం, తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, దుర్వినియోగం అయిన నిధులు రికవరీ చేయాలని పలుమార్లు బాధితులు మున్సిపల్ కమిషనర్లు, మెప్మా పీడీ, ఉన్నతాధికారులకు విన్నవించారు. కానీ రాజకీయ జోక్యం వల్ల ఆమెపై చర్యలకు బ్రేక్ పడింది. ఈనేపథ్యంలో డీఎస్పీ ప్రభాకర్ గత నెల 9వ తేది పుంగనూరు పోలీస్ స్టేషన్‌లో గ్రీవెన్స్ డే నిర్వహించగా ఆర్పీ రెడ్డిరాణి నిధులు స్వాహా చేశారంటూ శ్రీవైభవలక్ష్మిగ్రూపు సభ్యులు ఫిర్యాదు చేశారు.దీంతో స్పందించిన డీఎస్పీ మెప్మా సీఎంఎం హరినాయక్‌కు ఫోన్ చేసి నిధుల స్వాహాపై ఫిర్యాదు ఇవ్వాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో మెప్మాలో ఆడిట్ జరిగి శ్రీవైభవలక్ష్మి గ్రూపులో ఆర్పీ రెడ్డిరాణి రూ.22.50 లక్షలు నిధులు చెల్లించాలని గుర్తించడంతో నిధులు రికవరీ చేయాలని మెప్మా సీఎంఎం హరినాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ విషయంపై విచారించి చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య



లోకేష్ (ఫైల్ ఫొటో)

చౌడేపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. చౌడేపల్లె మండలం ఎ.కొత్తకోట పంచాయతీ ఎస్.అగ్రహారానికి చెందిన కమలాకర్ కుమారుడు లోకేష్ (24)కు గ్రామ సమీపంలోనే 6.33 ఎకరాల పొలముంది. తండ్రి చనిపోయాక వ్యవసాయం చేసుకుంటూ తల్లి హేమావతితో కలిసి జీవించేవాడు. వ్యవసాయానికి అప్పులు చేయాల్సిరావడంతో గత ఏడాది తల్లి పొలం విక్రయించి సుమారు రూ.15 లక్షల దాకా అప్పులు తీర్చింది. ఇటీవల మళ్లీ చీటీ వేయడంతోపాటు పలువురి వద్ద సుమారు రూ.40 లక్షల వరకు అప్పులు చేశాడు.2 ఎకరాల్లో టమోటా పంట సాగు చేశాడు. టమోటాకు గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టం వచ్చింది. అప్పుల ఒత్తిడి పెరడంతో తల్లి హేమావతి లోకేష్‌ను ఇలా అప్పులు చేస్తే ఎలా అని మందలించింది. ఈక్రమంలో పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన సెల్‌ఫోన్ స్టేటస్‌లో అయామ్ వెరీ సారీ అని పెట్టాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఎమ్మెల్యే కార్యాలయాల్లో నేడు ప్రజాదర్బార్

చిత్తూరు సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కార్యాలయాల్లో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి. ● చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ పరిధిలోని బాధితుల నుంచి అర్జీలను స్వీకరిస్తారు. ● లక్ష్మీనగర్ కాలనీలోనే ఉన్న ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ కార్యాలయంలోనూ ఉదయం 11.30 గంటల నుంచి నియోజకవర్గ పరిధిలోని బాధితుల నుంచి అర్జీలను స్వీకరిస్తారు. బాధితులు తమ వినతిపత్రంతోపాటు ఆధార్ కార్డు జెరాక్స్ జత చేయాలి.

వైసీపీ ప్రభుత్వంలో రూ.3వేల కోట్ల మద్యం కుంభకోణం : టీడీపీ



సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో సుమారు రూ.3వేల కోట్ల మద్యం కుంభకోణం జరిగిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ ఆరోపించారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలో జరిగిన మద్యం కుంభకోణం దేశంలోనే అతిపెద్దది అన్నారు. ఇందులో ఉన్నతస్థాయి అధికారులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖుల ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెలుగు చూస్తోందని చెప్పారు. కొత్త మద్యం కంపెనీలను రంగంలోకి దింపి, భారీగా ముడుపులు ఇచ్చేవారికే ఆర్డర్లు ఇచ్చారన్నారు. నాసిరకం మద్యం అమ్మకాలతో వినియోగదారుల ఆరోగ్యాన్ని పాడు చేశారని విమర్శించారు. దశలవారీగా మద్యపాన నిషేధమని మభ్యపెట్టి వ్యక్తిగత మద్యం వినియోగం 5.55 లీటర్ల నుంచి 6.23కు పెంచారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై సీబీఐ, ఈడీలతో విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

బుడిగిపెంటలో డబ్ల్యూహెచ్‌వో వైద్యురాలు



బాలుడి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ మౌనిక

యాదమరి, మే 8 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలోని బుడిగిపెంట గ్రామాన్ని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో) డాక్టర్ మౌనిక స్థానిక వైద్యబృందంతో కలిసి గురువారం సందర్శించారు. రెండు నెలల క్రితం గ్రామానికి చెందిన జయదీప్ (14)కు పలురకాల రుగ్మతలు రావడంతో చిత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స చేశాక బాలుడికి సంబంధించిన నివేదికలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డబ్ల్యూహెచ్‌వోకు పంపారు. ఈ నేపథ్యంలో బాలుడి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ మౌనిక తెలుసుకుని, వివరాలు నమోదు చేసుకున్నారు. చిన్నపాటి సమస్యతోనే బాలుడు కొంతకాలం ఇబ్బంది పడ్డారని నిర్ధారించారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణతో, హెల్త్ సూపర్‌వైజర్ సెల్వరాణి, హెల్త్ అసిస్టెంట్ సురేందర్ రెడ్డి, మహిళా ఆరోగ్య కార్యకర్త అపర్ణ శిల్ప, అంగన్వాడీ వర్కర్ హిమావతి, ఆశా కార్యకర్త రూబి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా నుంచి మృతుల పేర్లు తొలగించండి

కలెక్టర్ సుమిత్‌కుమార్



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా నుంచి మృతుల పేర్లు తొలగించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. జిల్లాలో ఎన్‌సీడీ 3.0 సర్వే జరుగుతుందని, తద్వారా కుటుంబంలోని వివరాల సేకరణ జరుగుతున్నట్లు చెప్పారు. ఫారం-6 కింద 3,595 దరఖాస్తులు అందగా 2,297, ఫారం-7 ద్వారా 3,034 అందగా 1,889, ఫారం-8 కింద 5,304 అందగా 4,177 వరకు పరిష్కరించామన్నారు. సురేంద్రకుమార్(టీడీపీ) మాట్లాడుతూ.. జాబితా నుంచి మల్టిపుల్ ఓటర్లను తొలగించాలని సూచించారు. ఓటర్లకు అందుబాటులో ఉండేలా పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ) కోరారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో కొత్త ఓటర్లకు ఓటరు కార్డులు త్వరగా అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి మారిన ఓటర్ల పేర్ల అంశాన్ని పరిశీలించాలని గంగరాజు(సీపీఎం) విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీఆర్వో మోహన్‌కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరదేశి (కాంగ్రెస్), యశ్వంత్(జనసేన), ఉదయ్‌కుమార్ (వైసీపీ), బాలసుబ్రహ్మణ్యం (ఆమ్ ఆద్మీ), భాస్కర్ (బీఎస్పీ), ఎన్నికల విభాగం తహసీల్దార్ వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు వద్ద రూ. 15.27కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కు



నాగమంగళం వద్ద ఎంఎస్ఎంఈ పార్కు శిలాఫలక ఆవిష్కరణలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రీన్యూర్) పార్కును ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరు సమీపంలోని నాగమంగళం వద్ద గురువారం 15.27 కోట్లతో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయనున్న ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సు ఎంఎస్ఎంఈ పార్కుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి ప్రతి ఇంటిలో ఓ పారిశ్రామికవేత్తను తయారు చేయాలని ప్రభుత్వం సబ్సిడీలను ఇచ్చి ప్రోత్సహిస్తోందన్నారు. మూడు రాష్ట్రాల కూడలిలో ఉన్న పలమనేరు ప్రాంతానికి అన్ని విధాలుగా రోడ్డు సౌకర్యంతో పాటు పోర్టు సౌకర్యం, ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ వున్నందున పరిశ్రమల స్థాపనకు అనుకూలమని వివరించారు.ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా స్థానికులు ఎదగాలన్నారు. ఆర్డీవో భవాని, తహసీల్దార్ ఇన్బనాథన్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, డీఐసీ జనరల్ మేనేజర్ సూరిబాబు, డిప్యూటీ జోనల్ మేనేజర్ భార్గవి, అసిస్టెంట్ మేనేజర్ ఇస్మాయిల్, ప్రాజెక్టు ఇంజనీర్ ప్రవీణ్, లైజనింగ్ ఆఫీసర్ లోకేష్, ఐపీవో రామానుజులు, పలమనేరు సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజి, టీడీపీ నేతలు కిషోర్‌గౌడ, సోమశేఖర్‌గౌడు, రంగనాథ్, నాగరాజరెడ్డి, ఆర్బీసీ కుట్టి, గిరి, ప్రతాప్‌రెడ్డి, ఆటోనగర్ అండ్ ఎంఎస్ఎం యూనియన్ నాయకులు అమరనాథరెడ్డి, జగదీష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

పంటలపై కొనసాగిన గజ దాడులు

● వందల సంఖ్యలో మామిడిచెట్ల ధ్వంసం



మామిడిచెట్టును నేల మట్టంగా విరిచేసిన ఏనుగులు

కల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగాయి. రెండేళ్లుగా మండలంలో వివిధ దఫాలుగా తిష్ట వేసిన ఏనుగుల గుంపు మామిడి, వరి, కొబ్బరి, టమోటా, అరటి తదితర పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇటీవల ఒంటరి ఏనుగు నిత్యం ఏదో ఒక ప్రాంతంలో పంటలను ధ్వంసం చేస్తోంది.మండలంలోకి రెండు రోజుల క్రితం చేరుకున్న 13 ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడం ప్రారంభించాయి.ఒక వైపు అకాల వర్షంతో మామిడి కాయలు నేల రాలడంతో నష్టాన్ని చవిచూస్తున్న రైతాంగానికి ఏనుగుల గుంపు కూడా మామిడిచెట్లపై దాడులు చేస్తుండడంతో పంటపై ఆశలు వదులుకుంటున్నారు.బుధవారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన ఏనుగుల గుంపు ముందుగా సైదుల్లా గుట్ట వద్దకు చేరుకున్నాయి. కోటపల్లిలోని వెంకట్రామ నాయుడికి చెందిన 65 మామిడిచెట్లను విరిచేసిన ఏనుగుల గుంపు మామిడికాయలను నేలరాల్చాయి.భాస్కర నాయుడికి చెందిన 20 మామిడిచెట్లు, ఎర్రయ్యకు చెందిన 5, వినాయకకు చెందిన 20, దామోదర నాయుడికి చెందిన 20 ,చెంగయ్యకు చెందిన 9, జూపల్లిలోని వెంకట్రమణకు చెందిన 30, నాగరాజుకు చెందిన 5 మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. ఒక్క రోజే సుమారు 4 టన్నుల మామిడికాయలను ఏనుగుల గుంపు నేలరాల్చాయి. ఉదయం తమ మామిడి తోటల వద్దకెళ్లి ధ్వంసమైన పంటలను చూసిన రైతులు అటవీశాఖ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పు, పశ్చిమ విభాగం అటవీశాఖ సిబ్బంది సమన్వయ లోపంతో ఒకరి బీట్ నుంచి మరొకరి బీట్‌లోకి ఏనుగులను తరుముకుంటూ చేతులు దులుపుకోవడంతోనే పంటలపై ఏనుగుల దాడులు అధికమవుతున్నాయని వాపోయారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

జీడీనెల్లూరు అభివృద్ధికి సహకరించండి

● మంత్రి లోకేశ్‌కు థామస్ వినతి


మంత్రి లోకేశ్‌తో థామస్ కరచాలనం

పాలసముద్రం, మే 8 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ కోరారు. గురువారం తిరుపతి జిల్లా శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ సంస్థ భూమి పూజ చేసిన మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని మంత్రికి విన్నవించారు.

రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ ఆవిష్కరణ


ప్లాన్‌ను చూపుతున్న కమిషనర్ నరసింహప్రసాద్, ఏసీపీ నాగేంద్ర తదితరులు

చిత్తూరు అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): మేయర్ అముద ఆదేశాలతో కమిషనర్ నరసింహ ప్రసాద్, సిటీ ప్లానర్ నాగేంద్ర, టీపీవో శుభప్రద, బిల్డింగ్ సూపర్‌వైజర్ బాలాజీ గురువారం రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. ఇటీవల హైరోడ్డు విస్తరణ పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే వెంకుశ కల్యాణ మండపం నుంచి కలెక్టరేట్ వరకు ప్రభుత్వ భవనాలు, ప్రహరీలను తొలగించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వెంకుశ కల్యాణ మండపం నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు సుమారు 1.1 కిలోమీటరు వరకు అండర్‌రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. దీనిపై స్థల యజమానులకు ఏమైనా సందేహాలు, సూచనలు ఉంటే నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో 15 రోజుల్లోగా సంప్రదించాలని కమిషనర్ కోరారు.

కులగణన ఓ చారిత్రాత్మక నిర్ణయం:బీజేపీ

గంగాధరనెల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాలతో దేశవ్యాప్తంగా చేపట్టనున్న కులగణన ఓ చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర బీజేపీ ఓబీసీ కార్యవర్గ సభ్యుడు ఇడగట్టి సుధాకర్ అన్నారు. గంగాధరనెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ.. 94 ఏళ్ల తర్వాత దేశంలో కుల ఆధారిత జనాభా గణన చేయడానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇది ఆయా కులాల పురోభివృద్ధికి దోహదం పడుతుందని చెప్పారు. మోదీ తీసుకున్న నిర్ణయాన్ని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖులు స్వాగతిస్తున్నారని తెలిపారు.

కంచి గరుడ సేవ పోస్టర్ల ఆవిష్కరణ



నగరి, మే 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పరిధిలోని నగరి పట్టణంలోని కరియమాణిక్య స్వామి ఆలయంలో ఈనెల 13వ తేదీన కంచి గరుడ సేవ జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆలయ అధికారి వెంకటరమణ గురువారం ఆవిష్కరించారు. స్థానిక భక్తుల సహకారంతో ముద్రించిన ఈ పోస్టర్లను ఆలయ అభివృద్ధి సేవా సభ్యులు భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ధన్వంతరాచార్యులు, నరసింహప్రసాద్, వేదపారాయణ పండితులు రామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

తలసేమియా ప్రాణాంతక వ్యాధి


రక్తదానం చేస్తున్న డీఎస్పీ అజీజ్

నగరి, మే 8 (ఆంధ్రజ్యోతి): తలసేమియా ప్రాణాంతక వ్యాధుల్లో ఒకటని డీఎస్పీ అజీజ్ అన్నారు. గురువారం ప్రపంచ తలసేమియా దినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్పీ ఆదేశాలతో పోలీసులు రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను డీఎస్పీ అందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఏటా మే 8వ తేదీన రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సీఐ విక్రమ్, ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతను అందరూ చదవాలి


ప్రచారంలో పాల్గొన్న సేవా సమితి సభ్యులు

చిత్తూరు కల్చరల్, మే8 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత భగవద్గీతను అందరూ చదవాలని నెల్లూరు ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు డి.సురమౌళి సూచించారు. గురువారం మురకంబట్టు, చవటపల్లె, ఇందిరానగర్, వెంగనపల్లె తదితర ప్రాంతాల్లో ఈ మేరకు ప్రచారం నిర్వహించారు. ప్రజలకు భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. సభ్యులు రాజేంద్ర, రెడ్డెమ్మ, వాణిశ్రీ, కొండమ్మ, హర్షవర్ధన్, సాయి తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

నేమ్ బోర్డు లేని పంచాయతీ కార్యాలయం


కార్యాలయ ఆవరణలో నిలిచిన వర్షపునీరు

వెదురుకుప్పం, మే 8 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఎర్రమరాజుపల్లె పంచాయతీ కార్యాలయానికి కనీసం నేమ్ బోర్డు లేదు. కార్యాలయం కూడా నిత్యం తెరవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మరోవైపు చిన్నపాటి వానకే కార్యాలయ ప్రాంగణంలో నీరు నిలుస్తోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆరోగ్యంపై అవగాహన

పాలసముద్రం, మే 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు, వైద్యసిబ్బందికి నిమ్స్ డాక్టర్లు డాక్టర్ రమేష్, డాక్టర్ సంతోష్ గురువారం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు మాట్లాడారు. దీర్ఘకాలిక రోగులకు సూచనలిచ్చారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి, ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

రెండు మండలాల్లో
మోస్తరు వర్షం

వెదురుకుప్పం, మే 8 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. మండుతున్న ఎండల నుంచి జనానికి ఉపశమనం లభించింది.

రెండు పంచాయతీల్లో
నేడు థామస్ పర్యటన

గంగాధరనెల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): కొండేపల్లె, పాపిరెడ్డిపల్లె పంచాయతీల్లో శుక్రవారం ప్రభుత్వవిప్ డాక్టర్ వి.ఎం.థామస్ పర్యటించనున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, ప్రధాన కార్యదర్శి జ్యోతిరెడ్డి తెలిపారు. కొండేపల్లె పంచాయతీ పోలినాయుడుపల్లెలో సిమెంట్ రోడ్డును మధ్యాహ్నం 12.30గంటలకు ప్రారంభిస్తారు. పాపిరెడ్డిపల్లె పంచాయతీలో మినీ ఇండోర్ క్రికెట్ కోర్టును, పెడకంటిపల్లె హైస్కూల్లో స్టేజీని ప్రారంభించనున్నారు. అనంతరం పెడకంటిపల్లె దళితవాడలో మధ్యాహ్నం మూడు గంటలకు ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి థామస్ హాజరై.. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

గొల్లమడుగు ఎస్సీ కాలనీ
జలమయం
తీవ్ర ఇబ్బంది పడుతున్న స్థానికులు


వీధుల్లో నిలిచిన వర్షపునీటిలో ఇబ్బంది పడుతున్న జనం

గుడిపాల, మే 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన గొల్లమడుగు ఎస్సీకాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో గురువారం కురిసిన కొద్దిపాటి వర్షానికే జలమయమైంది. వీధులన్నీ వర్షపు నీటి నిండిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే సమీపంలోని బెంగళూరు- చెన్నై రహదారిపై ఉన్న గట్రాళ్లమిట్ట వంకలో వర్షపునీటి పారుదల స్తంభించింది. ఈ నీరు కూడా ఎస్సీకాలనీపై పడుతోంది. దీనివల్ల విష పురుగులు ఇళ్లలోని వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గురుగునత్తం సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోయి రాకపోకలు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇకనైనా ఈ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వానొస్తే.. ఇబ్బందులే..!


అరుణానగర్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

ఐరాల, మే 8 (ఆంధ్రజ్యోతి): ఐరాలకు కూతవేటు దూరంలోని అరుణనగర్ కాలనీ వద్ద వర్షం కురిస్తే ఇబ్బందులు తలెత్తున్నాయి. గురువారం కురిసిన మోస్తరు వానకే అరణానగర్ వద్ద రోడ్డుపై నీరు నిలిచింది. నడిచి వెళ్లేవారు, ద్విచక్రవాహనదారులు అవస్థలు పడ్డారు. డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండటం వల్లే దీనికి కారణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


గతంలో..


ప్రస్తుతం..

కొట్రకోన కొత్తూరు వద్ద..

గుంతలరోడ్డుకు మోక్షం
'ఇది మంచి ప్రభుత్వం' అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్న స్థానికులు

గంగాధరనెల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): గుంతల రోడ్డుకు మోక్షంలభించడంతో 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో కొట్రకోన పంచాయతీలోని నీవా నదిలో ఇసుక రీచ్ నిర్వహించారు. ఇసుక తరలించే వాహనాలతో చిత్తూరు - పుత్తూరు మెయిన్‌రోడ్డు నుంచి ఇందిరానగర్ కాలనీ, పెద్దకాల్వ, కె.కొత్తూరు (ముకుందరాయనిపేట), గారంపల్లె రోడ్డు మలుపు, కొట్రకోన, కె.లక్ష్మీరెడ్డిపల్లె వరకు (చిత్తూరు నగరం సరిహద్దు) తారురోడ్డు గుంతలమయంగా మారిపోయింది. స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఈ రోడ్డును బాగు చేయకుండా వదిలేశారు. ఆ తర్వాత ఎన్నికల ప్రచారంలో ఉన్నప్పుడు ప్రస్తుత ఎమ్మెల్యే థామస్ కారు సైతం కొట్రకోన కొత్తూరు వద్ద బురదలో ఇరుక్కుని ఇబ్బంది పడాల్సి వచ్చింది. థామస్ ఎమ్మెల్యే అయ్యాక కొట్రకోన పంచాయతీకి చెందిన టీడీపీ నేతలు నరసింహులునాయుడు, ప్రసాద్‌నాయుడు, హరిచౌదరికలిసి వేల్కూరు బస్టాప్ పుత్తూరుమెయిన్ రోడ్డు నుంచి కొట్రకోన పంచాయతీ సరిహద్దు వరకు గుంతలతో అధ్వానంగా ఉన్న రోడ్డుకు తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కూడా ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి తారు రోడ్డు పనులను పూర్తి చేయించారు. ఇదే రహదారిలో చిత్తూరు - తచ్చూరుకు హైవేరోడ్డు నిర్మాణపనులకు కంకరరాళ్లు (జల్లి) భారీ టిప్పర్లతో తరలిస్తుండటంతో సుమారు కిలోమీటరు మాత్రం తారు రోడ్డు వేయకుండా నిలిపేసి, మిగిలిన నాలుగు కిలోమీటర్లను నిర్మించారు. దీనిపై వేల్కూరు, పెద్దకాల్వ, కొట్రకోన, కలిజవేడు, నందనూరు పంచాయతీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే హామీతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ కిషోర్ కుమార్, డీఈఈ వెంకటముని తదితరులు

విజయపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హామీతో జగన్నాథపురంలో గురువారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటైంది. ట్రాన్స్‌ఫార్మర్ లేక పంటలు ఎండిపోతున్నదని మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ట్రాన్స్‌కో అధికారులకు ఆదేశాలిచ్చారు. అధికారులు ట్రాన్‌ఫార్మర్లు పెట్టి కొత్తగా లైన్లు లాగి సమస్యను పరిష్కరించారు. దీనిపై అధికారులకు, ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ కిషోర్‌కుమార్, డీఈఈ వెంకటముని, చంద్రబాబు, ఏఈఈ సదాశివం, సర్పంచ్ రాణీ నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

11న తిరుపతిలో మాలల ఆత్మీయ గౌరవ సభ


కరపత్రాలను ఆవిష్కరించిన నాయకులు

చిత్తూరు సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల ఐక్యతను చాటడానికి ఈనెల 11వ తేదీన తిరుపతిలో మాలల ఆత్మీయ గౌరవ సభ నిర్వహించనున్నట్లు దళిత జాతీయ నేత దుగ్గాని జయరాం తెలిపారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో మాలలకు అన్యాయం జరుగుతోందని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడానికి ఎస్సీ వర్గీకరణను అస్త్రంగా వాడుకుంటున్నారని అన్నారు. మాలల ఐక్యత, ఆత్మగౌరవాన్ని చాటేలా తిరుపతిలోని ఆశా కన్వెన్షన్ హాల్లో ఈనెల 11వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు సభను నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. సభకు మాల రాజకీయ నేతలు, ఉద్యోగ సంఘ నాయకులు, మేధావులు తరలిరానున్నట్లు చెప్పారు. అనంతరం సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వివిధ మాల సంఘాల నేతలు రాఘవులు, దామోదరం, ధనుంజయరావు, రాజ్ కుమార్, దాము, దయానందం పాల్గొన్నారు.

10,800 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

● నలుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

యాదమరి, మే 8 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నల మాటున తరలించడానికి సిద్ధంగా ఉన్న 10,800 కిలోల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలంలోని పుల్లయ్యగారిపల్లె గ్రామంలో పురుషోత్తం నాయుడికి సంబంధించిన ఖాళీ గోడౌన్‌ను యాదమరికి చెందిన అబ్దుల్ సలాం, పలమనేరుకు చెందిన రోషన్, చెంగల్రాయులు, కర్ణాటకకు చెందిన ప్రదీప్‌లు మొక్కజొన్నల వ్యాపారం కోసమని బాడుగకు తీసుకున్నారు. అందులో రేషన్ బియ్యం నిల్వ ఉంచి, కర్ణాటకకు అక్రమంగా తరలించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ సమాచారంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి ఆ గోడౌన్‌పై దాడులు చేశారు. సుమారు 10,800 కిలోల బియ్యం, క్వాలిస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంగజాతర ఏర్పాట్లపై సమావేశం

చిత్తూరు అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): గంగజాతర ఏర్పాట్లపై గురువారం స్థానిక పోలీసు అతిథి గృహంలో నగరంలోని 11 ప్రాంతాలకు చెందిన జాతర కమిటీ సభ్యులు, రెవెన్యూ, ఫైర్, ఎక్సైజ్, ఆర్టీసీ, వైద్య శాఖల అధికారులతో పోలీసులు సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ రాజశేఖర రాజు మాట్లాడుతూ.. గంగజాతరకు వేలాది మంది భక్తులు హాజరవుతున్నారన్నారు. ప్రతిశాఖకు సంబంధించిన అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని చెప్పారు. భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లను పక్కాగా చేయాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, పిల్లలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. జాతర జరిగే ప్రాంతంలో మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ సాయినాథ్, సీఐలు మహేశ్వర్, నెట్టికంటయ్య, తాలూకా ఎస్ఐ మల్లికార్జున, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఫైర్ ఆఫీసర్ కరుణాకర్, ఆర్టీసీ డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

● 8 మందిపై కేసు నమోదు

నగరి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. సీఐ విక్రమ్ తెలిపిన వివరాల మేరకు.. రెండ్రోజుల కిందట ఓంశక్తి గుడి పక్కన ఉన్న మద్యం దుకాణం వద్ద చిన్నపాటి గొడవ జరిగింది. ఇది కాస్తా పెద్దదై బుధవారం రాత్రి పది గంటలకు నగరి పట్టణ పరిధిలోని కీళపట్టు సమీపంలో ఉన్న హోటల్ వద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో అమృతరాజు, మైఖేల్ వారి అనుచరులు నలుగురిపై, మరో వర్గంలోని కుమరేశన్, రాజాలపై గురువారం కేసు నమోదు చేయగా, డీఎస్పీ అజీజ్ దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రక్తదానం



చిత్తూరు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనాంట్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువకులు రక్తదానం చేశారు. అనంతరం గత నెల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన 36 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా కార్యదర్శి సహదేవనాయుడు దంపతులు నిరాశ్రయులకు అన్నదానం చేశారు. వైస్‌చైర్మన్ బాబి, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, మోహన్‌కుమార్, అరుణకుమారి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పాండవుల ఊరేగింపు



గుడిపాల, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతాపురంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం బసవాపల్లె గ్రామస్తులు ద్రౌపదీ సమేత పాండవుల ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బసవాపల్లె గ్రామంలోని పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. మహాభారత కమిటీ సభ్యులు, పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయానికి మహాద్వారం


మహాద్వారానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బైరెడ్డిపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి ఆలయానికి సంబంధించి బేలుపల్లె క్రాస్‌లో నూతనంగా నిర్మించిన మహాద్వారాన్ని గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అర్చకులు మురళీకృష్ణాచార్యులు మహాద్వారానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహాద్వార నిర్మాణ దాతలు గౌరమ్మ, గుర్రాల గంగప్ప, కాంతరాజులు, మాజీ సైనికోద్యోగి కుటుంబ సభ్యులకు ఆలయ ధర్మకర్త నారాయణమొదలి, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కల్యాణ వెంకన్న ఆలయ మహాద్వారం నిర్మించడం పూర్వజన్మ సుకృతమని, ఈ అవకాశం తమకు లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని దాతలు తెలిపారు.

సంక్షిప్తంగా..

'స్కిల్ ఆఫ్ డిజిటల్'పై రైతులకు శిక్షణ

తవణంపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): 'స్కిల్ ఆఫ్ డిజిటల్'పై వెంగంపల్లెలో రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ ఫోన్‌వాడకం, డిజిటల్ చెల్లింపులు, యూట్యూబ్ పాత్ర, మార్కెటింగ్ విక్రయాలు, వ్యవసాయం, ఉద్యాన శాఖ పథకాలను తెలుసుకోవడం వంటి తదితర అంశాలపై రైతులకు రిసోర్స్ పర్సన్ లేష్మ శిక్షణనిచ్చారు. ఏవో ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

ఐరాల: మండలం ఎర్రేపల్లెలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ అధికారి తులసీరామ్, మాస్టర్ ట్రైనర్ ఆనందరాజ్, ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణపై ఎంపీడీవో ఆరా

పెనుమూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారు చేయడంపై క్లాప్‌మిత్రలకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి అవగాహన కల్పించారు. గురువారం గుత్తావాండ్లవూరు, కావూరివారిపల్లె, శాతంబాకం పంచాయతీల్లోని సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. చెత్త సేకరణ ఎలా జరుగుతుందని ఆరా తీశారు. అలాగే గ్రామాల్లోని పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, సెక్రటరీలు శ్రీనివాసులు, హేమలత, జన్మశ్రీతోపాటు క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

నేటినుంచి క్రైస్తవ కూటములు

గుడిపాల, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన శాంతిపురం సీయోన్ మలై చర్చిలో శుక్రవారం నుంచి మూడ్రోజుల పాటు క్రైస్తవ కూటములు నిర్వహిస్తున్నట్లు పాస్టర్లు తెలిపారు. తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా క్రైస్తవులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

22లోపు మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

రొంపిచెర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐఐటీ, జేఈఈ, నీట్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరళ తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరే విద్యార్థులు ఈనెల 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి మార్కుల మెరిట్‌పై విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు. కోచింగ్ మెటీరియల్ సైతం ఇవ్వనున్నట్లు తెలిపారు.

చింతచెట్టుపై పిడుగు



కల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పరిసరాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇదే సమయంలో కల్లూరుకి సమీపం దేవళంపేటలోని మునికృష్ణ ఇంటి వద్ద ఉన్న ఓ చింతచెట్టుపై పిడుగు పడింది. చెట్టుపై ఉన్న చిన్నపాటి పక్షులు మృతి చెందాయి. ముందస్తు సూచనలతో ప్రజలు ఇళ్లలోకి చేరుకున్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

పూతలపట్టు, మే 8 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల పరిధిలోని నయనంపల్లెకు చెందిన సుధాకర్ పొలం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రెండ్రోజుల గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులోని రాగి వైర్లు, ఆయిల్‌ను ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని గురువారం సీఐ కృష్ణమోహన్ తెలిపారు.

డైట్ లెక్చరర్‌గా సురేష్‌బాబు

కుప్పం, మే 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం పెద్దగోపనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు టి.సురేష్ బాబు కార్వేటినగరంలోని ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం (డైట్)లో సైకాలజీ బోధించుటకు ఫారిన్ సర్వీసు కింద ఎంపికయ్యారు.

జీడీనెల్లూరు అభివృద్ధికి సహకరించండి

● మంత్రి లోకేశ్‌కు థామస్ వినతి


మంత్రి లోకేశ్‌తో థామస్ కరచాలనం

పాలసముద్రం, మే 8 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ కోరారు. గురువారం తిరుపతి జిల్లా శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ సంస్థ భూమి పూజ చేసిన మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా తన నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని మంత్రికి విన్నవించారు.

రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ ఆవిష్కరణ


ప్లాన్‌ను చూపుతున్న కమిషనర్ నరసింహప్రసాద్, ఏసీపీ నాగేంద్ర తదితరులు

చిత్తూరు అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): మేయర్ అముద ఆదేశాలతో కమిషనర్ నరసింహ ప్రసాద్, సిటీ ప్లానర్ నాగేంద్ర, టీపీవో శుభప్రద, బిల్డింగ్ సూపర్‌వైజర్ బాలాజీ గురువారం రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. ఇటీవల హైరోడ్డు విస్తరణ పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే వెంకుశ కల్యాణ మండపం నుంచి కలెక్టరేట్ వరకు ప్రభుత్వ భవనాలు, ప్రహరీలను తొలగించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వెంకుశ కల్యాణ మండపం నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు సుమారు 1.1 కిలోమీటరు వరకు అండర్‌రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఆవిష్కరించారు. దీనిపై స్థల యజమానులకు ఏమైనా సందేహాలు, సూచనలు ఉంటే నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో 15 రోజుల్లోగా సంప్రదించాలని కమిషనర్ కోరారు.

కులగణన ఓ చారిత్రాత్మక నిర్ణయం:బీజేపీ

గంగాధరనెల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాలతో దేశవ్యాప్తంగా చేపట్టనున్న కులగణన ఓ చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర బీజేపీ ఓబీసీ కార్యవర్గ సభ్యుడు ఇడగట్టి సుధాకర్ అన్నారు. గంగాధరనెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ.. 94 ఏళ్ల తర్వాత దేశంలో కుల ఆధారిత జనాభా గణన చేయడానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇది ఆయా కులాల పురోభివృద్ధికి దోహదం పడుతుందని చెప్పారు. మోదీ తీసుకున్న నిర్ణయాన్ని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖులు స్వాగతిస్తున్నారని తెలిపారు.

కంచి గరుడ సేవ పోస్టర్ల ఆవిష్కరణ



నగరి, మే 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పరిధిలోని నగరి పట్టణంలోని కరియమాణిక్య స్వామి ఆలయంలో ఈనెల 13వ తేదీన కంచి గరుడ సేవ జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆలయ అధికారి వెంకటరమణ గురువారం ఆవిష్కరించారు. స్థానిక భక్తుల సహకారంతో ముద్రించిన ఈ పోస్టర్లను ఆలయ అభివృద్ధి సేవా సభ్యులు భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ధన్వంతరాచార్యులు, నరసింహప్రసాద్, వేదపారాయణ పండితులు రామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

తలసేమియా ప్రాణాంతక వ్యాధి


రక్తదానం చేస్తున్న డీఎస్పీ అజీజ్

నగరి, మే 8 (ఆంధ్రజ్యోతి): తలసేమియా ప్రాణాంతక వ్యాధుల్లో ఒకటని డీఎస్పీ అజీజ్ అన్నారు. గురువారం ప్రపంచ తలసేమియా దినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్పీ ఆదేశాలతో పోలీసులు రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను డీఎస్పీ అందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఏటా మే 8వ తేదీన రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సీఐ విక్రమ్, ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతను అందరూ చదవాలి


ప్రచారంలో పాల్గొన్న సేవా సమితి సభ్యులు

చిత్తూరు కల్చరల్, మే8 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత భగవద్గీతను అందరూ చదవాలని నెల్లూరు ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు డి.సురమౌళి సూచించారు. గురువారం మురకంబట్టు, చవటపల్లె, ఇందిరానగర్, వెంగనపల్లె తదితర ప్రాంతాల్లో ఈ మేరకు ప్రచారం నిర్వహించారు. ప్రజలకు భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. సభ్యులు రాజేంద్ర, రెడ్డెమ్మ, వాణిశ్రీ, కొండమ్మ, హర్షవర్ధన్, సాయి తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

నేమ్ బోర్డు లేని పంచాయతీ కార్యాలయం


కార్యాలయ ఆవరణలో నిలిచిన వర్షపునీరు

వెదురుకుప్పం, మే 8 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఎర్రమరాజుపల్లె పంచాయతీ కార్యాలయానికి కనీసం నేమ్ బోర్డు లేదు. కార్యాలయం కూడా నిత్యం తెరవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మరోవైపు చిన్నపాటి వానకే కార్యాలయ ప్రాంగణంలో నీరు నిలుస్తోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆరోగ్యంపై అవగాహన

పాలసముద్రం, మే 8 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు, వైద్యసిబ్బందికి నిమ్స్ డాక్టర్లు డాక్టర్ రమేష్, డాక్టర్ సంతోష్ గురువారం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు మాట్లాడారు. దీర్ఘకాలిక రోగులకు సూచనలిచ్చారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి, ఈవోపీఆర్డీ రమేష్ పాల్గొన్నారు.

రెండు మండలాల్లో
మోస్తరు వర్షం

వెదురుకుప్పం, మే 8 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. మండుతున్న ఎండల నుంచి జనానికి ఉపశమనం లభించింది.

రెండు పంచాయతీల్లో
నేడు థామస్ పర్యటన

గంగాధరనెల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): కొండేపల్లె, పాపిరెడ్డిపల్లె పంచాయతీల్లో శుక్రవారం ప్రభుత్వవిప్ డాక్టర్ వి.ఎం.థామస్ పర్యటించనున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, ప్రధాన కార్యదర్శి జ్యోతి రెడ్డి తెలిపారు. కొండేపల్లె పంచాయతీ పోలినాయుడుపల్లెలో సిమెంట్ రోడ్డును మధ్యాహ్నం 12.30గంటలకు ప్రారంభిస్తారు. పాపిరెడ్డిపల్లె పంచాయతీలో మినీ ఇండోర్ క్రికెట్ కోర్టును, పెడకంటిపల్లె హైస్కూల్లో స్టేజీని ప్రారంభించనున్నారు. అనంతరం పెడకంటిపల్లె దళితవాడలో మధ్యాహ్నం మూడు గంటలకు ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి థామస్ హాజరై.. ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

గొల్లమడుగు ఎస్సీ కాలనీ
జలమయం

తీవ్ర ఇబ్బంది పడుతున్న స్థానికులు


వీధుల్లో నిలిచిన వర్షపునీటిలో ఇబ్బంది పడుతున్న జనం

గుడిపాల, మే 8 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన గొల్లమడుగు ఎస్సీకాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో గురువారం కురిసిన కొద్దిపాటి వర్షానికే జలమయమైంది. వీధులన్నీ వర్షపు నీటి నిండిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే సమీపంలోని బెంగళూరు- చెన్నై రహదారిపై ఉన్న గట్రాళ్లమిట్ట వంకలో వర్షపునీటి పారుదల స్తంభించింది. ఈ నీరు కూడా ఎస్సీకాలనీపై పడుతోంది. దీనివల్ల విష పురుగులు ఇళ్లలోని వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గురుగునత్తం సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోయి రాకపోకలు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇకనైనా ఈ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వానొస్తే.. ఇబ్బందులే..!


అరుణానగర్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

ఐరాల, మే 8 (ఆంధ్రజ్యోతి): ఐరాలకు కూతవేటు దూరంలోని అరుణనగర్ కాలనీ వద్ద వర్షం కురిస్తే ఇబ్బందులు తలెత్తున్నాయి. గురువారం కురిసిన మోస్తరు వానకే అరణానగర్ వద్ద రోడ్డుపై నీరు నిలిచింది. నడిచి వెళ్లేవారు, ద్విచక్రవాహనదారులు అవస్థలు పడ్డారు. డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండటం వల్లే దీనికి కారణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


గతంలో..


ప్రస్తుతం..

కొట్రకోన కొత్తూరు వద్ద..

గుంతలరోడ్డుకు మోక్షం

'ఇది మంచి ప్రభుత్వం' అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్న స్థానికులు

గంగాధరనెల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): గుంతల రోడ్డుకు మోక్షంలభించడంతో 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో కొట్రకోన పంచాయతీలోని నీవా నదిలో ఇసుక రీచ్ నిర్వహించారు. ఇసుక తరలించే వాహనాలతో చిత్తూరు - పుత్తూరు మెయిన్‌రోడ్డు నుంచి ఇందిరానగర్ కాలనీ, పెద్దకాల్వ, కె.కొత్తూరు (ముకుందరాయనిపేట), గారంపల్లె రోడ్డు మలుపు, కొట్రకోన, కె.లక్ష్మీరెడ్డిపల్లె వరకు (చిత్తూరు నగరం సరిహద్దు) తారురోడ్డు గుంతలమయంగా మారిపోయింది. స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఈ రోడ్డును బాగు చేయకుండా వదిలేశారు. ఆ తర్వాత ఎన్నికల ప్రచారంలో ఉన్నప్పుడు ప్రస్తుత ఎమ్మెల్యే థామస్ కారు సైతం కొట్రకోన కొత్తూరు వద్ద బురదలో ఇరుక్కుని ఇబ్బంది పడాల్సి వచ్చింది. థామస్ ఎమ్మెల్యే అయ్యాక కొట్రకోన పంచాయతీకి చెందిన టీడీపీ నేతలు నరసింహులునాయుడు, ప్రసాద్‌నాయుడు, హరిచౌదరికలిసి వేల్కూరు బస్టాప్ పుత్తూరుమెయిన్ రోడ్డు నుంచి కొట్రకోన పంచాయతీ సరిహద్దు వరకు గుంతలతో అధ్వానంగా ఉన్న రోడ్డుకు తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కూడా ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి తారు రోడ్డు పనులను పూర్తి చేయించారు. ఇదే రహదారిలో చిత్తూరు - తచ్చూరుకు హైవేరోడ్డు నిర్మాణపనులకు కంకరరాళ్లు (జల్లి) భారీ టిప్పర్లతో తరలిస్తుండటంతో సుమారు కిలోమీటరు మాత్రం తారు రోడ్డు వేయకుండా నిలిపేసి, మిగిలిన నాలుగు కిలోమీటర్లను నిర్మించారు. దీనిపై వేల్కూరు, పెద్దకాల్వ, కొట్రకోన, కలిజవేడు, నందనూరు పంచాయతీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే హామీతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ కిషోర్ కుమార్, డీఈఈ వెంకటముని తదితరులు

విజయపురం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హామీతో జగన్నాథపురంలో గురువారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటైంది. ట్రాన్స్‌ఫార్మర్ లేక పంటలు ఎండిపోతున్నదని మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ట్రాన్స్‌కో అధికారులకు ఆదేశాలిచ్చారు. అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టి కొత్తగా లైన్లు లాగి సమస్యను పరిష్కరించారు. దీనిపై అధికారులకు, ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ కిషోర్‌కుమార్, డీఈఈ వెంకటముని, చంద్రబాబు, ఏఈఈ సదాశివం, సర్పంచ్ రాణీ నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

11న తిరుపతిలో మాలల ఆత్మీయ గౌరవ సభ


కరపత్రాలను ఆవిష్కరించిన నాయకులు

చిత్తూరు సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల ఐక్యతను చాటడానికి ఈనెల 11వ తేదీన తిరుపతిలో మాలల ఆత్మీయ గౌరవ సభ నిర్వహించనున్నట్లు దళిత జాతీయ నేత దుగ్గాని జయరాం తెలిపారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో మాలలకు అన్యాయం జరుగుతోందని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడానికి ఎస్సీ వర్గీకరణను అస్త్రంగా వాడుకుంటున్నారని అన్నారు. మాలల ఐక్యత, ఆత్మగౌరవాన్ని చాటేలా తిరుపతిలోని ఆశా కన్వెన్షన్ హాల్లో ఈనెల 11వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు సభను నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. సభకు మాల రాజకీయ నేతలు, ఉద్యోగ సంఘ నాయకులు, మేధావులు తరలిరానున్నట్లు చెప్పారు. అనంతరం సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వివిధ మాల సంఘాల నేతలు రాఘవులు, దామోదరం, ధనుంజయరావు, రాజ్ కుమార్, దాము, దయానందం పాల్గొన్నారు.

10,800 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

● నలుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు

యాదమరి, మే 8 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నల మాటున తరలించడానికి సిద్ధంగా ఉన్న 10,800 కిలోల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలంలోని పుల్లయ్యగారిపల్లె గ్రామంలో పురుషోత్తం నాయుడికి సంబంధించిన ఖాళీ గోడౌన్‌ను యాదమరికి చెందిన అబ్దుల్ సలాం, పలమనేరుకు చెందిన రోషన్, చెంగల్రాయులు, కర్ణాటకకు చెందిన ప్రదీప్‌లు మొక్కజొన్నల వ్యాపారం కోసమని బాడుగకు తీసుకున్నారు. అందులో రేషన్ బియ్యం నిల్వ ఉంచి, కర్ణాటకకు అక్రమంగా తరలించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ సమాచారంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కలిసి ఆ గోడౌన్‌పై దాడులు చేశారు. సుమారు 10,800 కిలోల బియ్యం, క్వాలిస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంగజాతర ఏర్పాట్లపై సమావేశం

చిత్తూరు అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): గంగజాతర ఏర్పాట్లపై గురువారం స్థానిక పోలీసు అతిథి గృహంలో నగరంలోని 11 ప్రాంతాలకు చెందిన జాతర కమిటీ సభ్యులు, రెవెన్యూ, ఫైర్, ఎక్సైజ్, ఆర్టీసీ, వైద్య శాఖల అధికారులతో పోలీసులు సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ రాజశేఖర రాజు మాట్లాడుతూ.. గంగజాతరకు వేలాది మంది భక్తులు హాజరవుతున్నారన్నారు. ప్రతిశాఖకు సంబంధించిన అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని చెప్పారు. భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లను పక్కాగా చేయాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, పిల్లలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. జాతర జరిగే ప్రాంతంలో మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ సాయినాథ్, సీఐలు మహేశ్వర్, నెట్టికంటయ్య, తాలూకా ఎస్ఐ మల్లికార్జున, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఫైర్ ఆఫీసర్ కరుణాకర్, ఆర్టీసీ డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

● 8 మందిపై కేసు నమోదు

నగరి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. సీఐ విక్రమ్ తెలిపిన వివరాల మేరకు.. రెండ్రోజుల కిందట ఓంశక్తి గుడి పక్కన ఉన్న మద్యం దుకాణం వద్ద చిన్నపాటి గొడవ జరిగింది. ఇది కాస్తా పెద్దదై బుధవారం రాత్రి పది గంటలకు నగరి పట్టణ పరిధిలోని కీళపట్టు సమీపంలో ఉన్న హోటల్ వద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో అమృతరాజు, షైబేల్ వారి అనుచరులు నలుగురిపై, మరో వర్గంలోని కుమరేశన్, రాజాలపై గురువారం కేసు నమోదు చేయగా, డీఎస్పీ అజీజ్ దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రక్తదానం



చిత్తూరు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనాంట్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువకులు రక్తదానం చేశారు. అనంతరం గత నెల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన 36 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా కార్యదర్శి సహదేవనాయుడు దంపతులు నిరాశ్రయులకు అన్నదానం చేశారు. వైస్‌చైర్మన్ బాబి, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, మోహన్‌కుమార్, అరుణకుమారి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పాండవుల ఊరేగింపు



గుడిపాల, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతాపురంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం బసవాపల్లె గ్రామస్తులు ద్రౌపదీ సమేత పాండవుల ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బసవాపల్లె గ్రామంలోని పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. మహాభారత కమిటీ సభ్యులు, పరిసర గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయానికి మహాద్వారం


మహాద్వారానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బైరెడ్డిపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి ఆలయానికి సంబంధించి బేలుపల్లె క్రాస్‌లో నూతనంగా నిర్మించిన మహాద్వారాన్ని గురువారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అర్చకులు మురళీకృష్ణాచార్యులు మహాద్వారానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహాద్వార నిర్మాణ దాతలు గౌరమ్మ, గుర్రాల గంగప్ప, కాంతరాజులు, మాజీ సైనికోద్యోగి కుటుంబ సభ్యులకు ఆలయ ధర్మకర్త నారాయణమొదలి, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కల్యాణ వెంకన్న ఆలయ మహాద్వారం నిర్మించడం పూర్వజన్మ సుకృతమని, ఈ అవకాశం తమకు లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని దాతలు తెలిపారు.

సంక్షిప్తంగా..

'స్కిల్ ఆఫ్ డిజిటల్'పై రైతులకు శిక్షణ

తవణంపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): 'స్కిల్ ఆఫ్ డిజిటల్'పై వెంగంపల్లెలో రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ ఫోన్‌వాడకం, డిజిటల్ చెల్లింపులు, యూట్యూబ్ పాత్ర, మార్కెటింగ్ విక్రయాలు, వ్యవసాయం, ఉద్యాన శాఖ పథకాలను తెలుసుకోవడం వంటి తదితర అంశాలపై రైతులకు రిసోర్స్ పర్సన్ లేష్మ శిక్షణనిచ్చారు. ఏవో ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

ఐరాల: మండలం ఎర్రేపల్లెలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ అధికారి తులసీరామ్, మాస్టర్ ట్రైనర్ ఆనందరాజ్, ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణపై ఎంపీడీవో ఆరా

పెనుమూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారు చేయడంపై క్లాప్‌మిత్రలకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి అవగాహన కల్పించారు. గురువారం గుత్తావాండ్లవూరు, కావూరివారిపల్లె, శాతంబాకం పంచాయతీల్లోని సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. చెత్త సేకరణ ఎలా జరుగుతందని ఆరా తీశారు. అలాగే గ్రామాల్లోని పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, సెక్రటరీలు శ్రీనివాసులు, హేమలత, జన్మశ్రీతోపాటు క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

నేటినుంచి క్రైస్తవ కూటములు

గుడిపాల, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన శాంతిపురం సీయోన్ మల్లై చర్చిలో శుక్రవారం నుంచి మూడ్రోజుల పాటు క్రైస్తవ కూటములు నిర్వహిస్తున్నట్లు పాస్టర్లు తెలిపారు. తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా క్రైస్తవులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

22లోపు మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

రొంపిచెర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐఐటీ, జేఈఈ, నీట్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరళ తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరే విద్యార్థులు ఈనెల 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి మార్కుల మెరిట్‌పై విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు. కోచింగ్ మెటీరియల్ సైతం ఇవ్వనున్నట్లు తెలిపారు.

చింతచెట్టుపై పిడుగు



కల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పరిసరాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇదే సమయంలో కల్లూరుకి సమీపం దేవళంపేటలోని మునికృష్ణ ఇంటి వద్ద ఉన్న ఓ చింతచెట్టుపై పిడుగు పడింది. చెట్టుపై ఉన్న చిన్నపాటి పక్షులు మృతి చెందాయి. ముందస్తు సూచనలతో ప్రజలు ఇళ్లలోకి చేరుకున్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

పూతలపట్టు, మే 8 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల పరిధిలోని నయనంపల్లెకు చెందిన సుధాకర్ పొలం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రెండ్రోజుల గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులోని రాగి వైర్లు, ఆయిల్‌ను ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని గురువారం సీఐ కృష్ణమోహన్ తెలిపారు.

డైట్ లెక్చరర్‌గా సురేష్‌బాబు

కుప్పం, మే 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం పెద్దగోపనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు టి.సురేష్‌బాబు కార్వేటినగరంలోని ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం (డైట్)లో సైకాలజీ బోధించుటకు ఫారిన్ సర్వీసు కింద ఎంపికయ్యారు.